ప్రజాశక్తి

శనివారం 11 మే 2024 | 8 పేజీలు



తిరుపతి

చిత్తూరు

'తొలిసారి' తలుపు తట్టిన హోం బ్యాలెట్

ఇంట్లోనే ఓటేయడం ఆనందంగా ఉంది

జానకమ్మ, ఎన్ఆర్ కమ్మపల్లి

నా పేరు జానకమ్మ. నా వయసు 98 సంవత్సరాలు. వద్ధాప్యంతో మంచంలో మగ్గుతున్నాను. అధికారులు మా ఇంటికి వచ్చి నాకు ఓటు కాగితాన్ని ఇచ్చి ఓటు వేయించారు. నా ఓటు వధా కాకుండా సద్వినియోగం చేసుకున్నాను.. నాకు సంతోషంగా ఉంది.

పండుటాకుల్లో 'ప్రత్యేక' ఆనందం

బిఎల్ఒల నిర్లక్ష్యంతో 12శాతమే అర్హులట

1255కి కేవలం 149మందే వినియోగం

చంద్రగిరిలో ఏమిటీ 'అనర్హత' రాజకీయం

ప్రజాశక్తి -రామచంద్రాపురం

అనారోగ్యం, వద్ధాప్యం, అంగవైకల్యంతో మంచాన పడి మగ్గుతున్న బెడ్ రెస్టెడ్ రోగుల కోసం, 85 సంవత్సరాలు పైబడిన ముదుసలికి హోంఓటు విధానాన్ని కేంద్ర ఎన్నికల కమిషన్ తొలిసారిగా అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో ఎన్నికల బ్యాలెట్ పండుటాకుల మంచాన్ని తాకింది. ఈనెల 7వ తారీఖున

2లో

నగరిలో జగన్ రోడ్డుషో

ఆర్‌కె రోజాను ఆదరించండి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, పుత్తూరు టౌన్

నగరి నుంచి మూడోసారి పోటీ చేస్తున్న నా చెల్లెలు రోజాను భారీ మెజార్టీతో గెలిపించి ఆదరించాలని సిఎం జగన్మోహన్‌రెడ్డి అభ్యర్థించారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా పుత్తూరులో రోడ్డుషో జరిగింది. డిగ్రీ కాలేజీ నుంచి బస్టాండ్, అంబేద్కర్ విగ్రహం, కార్వేటినగరం రోడ్డు వరకూ రోడ్డుషో సాగింది. ఈ సందర్భంగా జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబుకు అధికారం ఇస్తే సంక్షేమ పథకాలు అమలు కావని, అదే ఫ్యాన్‌ను గెలిపిస్తే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. రాబోయే ఎన్నిక అభివృద్ధిని నిర్ణయించేదన్నారు. 2.70 వేల కోట్లను వివిధ పథకాల ద్వారా ఖర్చు చేశామన్నారు. నాడు-నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను పూర్తిగా మార్చేశామన్నారు. 93శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ విద్యా కానుకగా అందించామన్నారు. ఇలాంటి విప్లవాత్మకమైన మార్పులను వైసిపి ప్రభుత్వ హయాంలోనే జరిగాయన్నారు. రైతులకు రైతుభరోసా, ఉచిత విద్యుత్, ఇన్‌పుట్ సబ్సిడీ అందించడంతో పాటు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. ఇలాంటి పథకాలు గతంలో ఎపుడైనా అమలయ్యాయా? అని అన్నారు. 14ఏళ్లపాటు సిఎంగా ఉన్న చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు ఒక్క మంచి పనిచేశానని చెప్పుకోడానికి ఏమీ లేదన్నారు. ఆర్‌కె రోజా మాట్లాడుతూ రెండుసార్లు గెలిపించిన నగరి ప్రజలు, మూడోసారి తనను గెలిపిస్తారని, గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. నగరిలో చెప్పిన దానికంటే ఇంకా ఎక్కువ అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. రాష్ట్రంలో సంక్షేమం కొనసాగాలంటే జగనన్న రావాలన్నారు. చంద్రబాబు కుట్ర రాజకీయాలను నమ్మొద్దన్నారు. టిడిపి అభ్యర్థి గాలి భానుప్రకాష్ తండ్రి ముద్దుకృష్ణమనాయుడ్ని చంపాడని స్వయంగా ఆయన తల్లి సరస్వతే తిట్టిన విషయాన్ని గుర్తు చేశారు. గాలి

2లో

జగన్‌వన్నీ ఉత్తుత్తి బటన్లే

ఎన్నికల ప్రచారంలో సిపిఐ అధినేత నారాయణ, హరినాథరెడ్డి

8లో

స్మగ్లర్లు రోజా వెంటున్నారు

నగర టిడిపి అభ్యర్థి గాలి భానుప్రకాష్

వార్త 2లో

ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి : జెవివి

నేటి సాయంత్రం 5కల్లా గప్‌చిప్

నేటితో ప్రచారానికి తెర
అభ్యర్థుల సుడిగాలి ప్రచారం
నేడు చిత్తూరుకు చంద్రబాబు రాక

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

సార్వత్రిక, సాధారణ ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం 5 గంటలకు తెరపడనుంది. మే 13న జరగనున్న నాలుగో విడత పోలింగ్‌లో తిరుపతి జిల్లాలో అసెంబ్లీకి 133 మంది, పార్లమెంట్‌కు 23 మంది బరిలో ఉన్నారు. జనసేన, టిడిపి, బిజెపి కూటములు ఓ పక్క, అధికార వైసిపి మరోపక్క, ఇండియా వేదికతో పాటు బిఎస్‌పి, లిబరేషన్ కాంగ్రెస్, స్వతంత్ర అభ్యర్థులు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. ఏకంగా తిరుపతి అసెంబ్లీకి అత్యధికంగా 46 మంది పోటీలో నిలవడం ప్రత్యేకం. అత్యల్పంగా సూళ్లూరుపేటలో 9 మంది బరిలో నిలిచారు.

ప్రచారానికి ఇంకా ఒక్కరోజే ఉండడంతో జిల్లావ్యాప్తంగా పోటీచేస్తున్న అభ్యర్థులు సుడిగాలి ప్రచారం చేస్తున్నారు. మైకులు హోరెత్తిస్తున్నారు. కుటుంబీకులు, బంధుమిత్రులు మంతనాలు జరుపుతున్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుత్తూరులో రోడ్డుషో, బహిరంగసభలో పాల్గొన్నారు. చిత్తూరుకు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రోడ్డుషో చివరి రోజు నిర్వహించి, సాయంత్రం శ్రీవారిని దర్శించుకోనున్నారు. తిరుపతి జిల్లాలో 200 మంది నామినేషన్లు దాఖలు చేయగా 133 మంది పోటీలో నిలిచినట్లు జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ అధికారికంగా వెల్లడించారు. సూళ్లూరుపేటలో 9 మంది, గూడూరు 14 మంది, వెంకటగిరి 10, చంద్రగిరి 24, తిరుపతి 46, సత్యవేడు 15, శ్రీకాళహస్తి 15 మంది వివిధ పార్టీల నుంచి, స్వతంత్రులుగానూ పోటీ చేస్తున్నారు. తిరుపతి పార్లమెంట్ స్థానానికి 23 మంది బరిలో మిగిలారు. ప్రధానంగా వైసిపి నుంచి సిట్టింగ్ ఎంపి మద్దిల

ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి దిశానిర్దేశం

గురుమూర్తి, బిజెపి నుంచి గూడూరు సిట్టింగ్ ఎంఎల్ఎ వరప్రసాద్, కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఇండియా ఫోరం నుంచి పోటీ చేస్తున్నారు.

తిరుపతిలో 'సైకిల్' గుర్తు ఉండదు

జనసేన, బిజెపి, టిడిపి కూటమి పొత్తులో భాగంగా తిరుపతిలో తొలిసారిగా అసెంబ్లీ, పార్లమెంట్‌కు సైకిల్ గుర్తు బ్యాలెట్‌లో ఉండబోదు. టిడిపి ఏర్పడి 41 ఏళ్లు పూర్తయిన తరువాత మొట్టమొదటిసారిగా ఈసారి ఎన్నికల్లో టిడిపి బరి నుంచి తప్పుకుంది. తిరుపతి అసెంబ్లీ జనసేనకు కేటాయించడంతో గ్లాస్ గుర్తు, పార్లమెంట్‌ను బిజెపికి కేటాయించడంతో కమలం గుర్తు బ్యాలెట్‌లో ఉంటాయి. ఈ నేపథ్యంలో ఈవిఎంలలో సైకిల్ గుర్తు కనబడదు.

ఏసీఏలో కోట్లు దోపిడి

జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసిఏ)లో అవినీతి అక్రమాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయని, కోర్టు తీర్పును సైతం లెక్కచేయకుండా, దొంగ సభ్యత్వలతో కోట్లాది రూపాయలు దోచేస్తున్నారని చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు విజయ (క్రికెట్ విజయ్) విమర్శించారు. తిరుపతిలోని ఆయన కార్యాలయం వద్ద శుక్రవారం అయిన విలేకరులతో మాట్లాడుతూ యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వారికి అవకాశాలను కల్పించేందుకు ఏర్పాటు చేయబడిన ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అక్రమాలకు, అవినీతికి అడ్డాగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడారంగంలో రాజకీయాలను తీసుకొచ్చి, ప్రభుత్వ పెద్దల సహకారంతో క్రికెట్ అసోసియేషన్ తమ జేబు సంస్థలుగా మార్చేసి భ్రష్టు పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. క్రీడాకారులు, అసోసియేషన్ అభివద్ధి కోసం బీసీసీఐ ప్రతి యాడాది కేటాయిస్తున్న 100 కోట్ల రూపాయలను, ఆంధ్ర అసోసియేషన్ పెద్దలని చెప్పుకునే వారు తమ రాజకీయ అవసరాల కోసం వినియోగించుకోవడం బాధాకరమన్నారు. అపెక్స్ కమిటీ సభ్యులు ఇప్పటికే 130 కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడ్డారని కోర్టులో కేసు నడుస్తుందని గుర్తు చేశారు. లిక్కర్ స్కామ్ లో ఉన్నవారు, వస్త్ర వ్యాపారాలు చేసుకుంటున్న వారు, అసలు క్రికెట్ కు ఏమాత్రం సంబంధం లేని వ్యక్తులు ఆంధ్ర క్రియేట్ అసోసియేషన్ లో సభ్యులుగా, నాయకులుగా ఉండడం విడ్డూరమన్నారు. ఇప్పటికే 130 కోట్లు అవినీతికి పాల్పడిన వీరు, మరో 105 కోట్లను దోచేందుకే ఇటీవలే జనరల్ బాడీ పేరుతో నిధులు మంజూరుకు అనుమతులు ఇచ్చారని పేర్కొన్నారు. క్రికెట్ అసోసియేషన్‌లో ఇలాంటి అవినీతి అనుకొండల పెత్తనం పోయే వరకు తన పోరాటాన్ని కొనసాగిస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ మూర్తి, సంయుక్త కార్యదర్శి సతీష్ యాదవ్, కోశాధికారి గిరి తదితరులు పాల్గొన్నారు.

(మొదటి పేజీ తరువాయి)

తొలిసారి తలుపు తట్టిన హోం బ్యాలెట్

చంద్రగిరి నియోజకవర్గంలో హోం ఓటింగ్ ప్రక్రియను ఎన్నికల అధికారులు సజావుగా నిర్వహించారు. చంద్రగిరి నియోజకవర్గంలో రామచంద్రాపురం, చంద్రగిరి, పాకాల, తిరుపతి రూరల్, చిన్న గొట్టిగల్లు, యర్రావారిపాలెం మండలాల్లో 85 సంవత్సరాలు వయసు నిండిన వద్ధులు, ప్రత్యేక ప్రతిభావంతులు, దీర్ఘకాలిక వ్యాధులతో 149 మంది ఓటర్లు హెూం ఓటును సద్వినియోగం చేసుకున్నారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కునువేస్తామో.... వేయలేమేమోనని....యోచనలో ఉన్న కొంతమంది దిగ్భ్రాంతికి గురయ్యారు. మరి కొంతమంది ఎలాగైనా ఈసారీ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహతహలాడారు. అనారోగ్యంతో చావు బతుకుల్లో మంచాన ఉన్నప్పటికీ..... ప్రజాస్వామ్య పరిరక్షణకు 'నా ఓటే......ప్రధానం' కావాలనే ఆశతో ఉన్న బెడ్ రెస్టెడ్ ఓటర్ల ఆశయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం నెరవేర్చింది. అయితే చంద్రగిరి నియోజకవర్గంలో మొత్తం 1255 మంది అర్హులు ఉండగా, కేవలం 149 మందినే అర్హులను చేస్తూ, మిగిలిన వారిని అనర్హులుగా ప్రకటించడంలో బిఎల్ఓల పాత్రపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నియోజకవర్గ వ్యాప్తంగా 85 సంవత్సరాలు వయస్సు నుండి వద్ధులు, ప్రత్యేక ప్రతిభావంతులు, బెడ్ రెస్టెడ్ పేషెంట్లు సుమారు 1255మంది ఉన్నారని స్వయంగా జిల్లా ఎన్నికల అధికారి ప్రకటించారు. కానీ స్థానిక బిఎల్వోలు వారికి హెూమ్ ఓటింగ్ కల్పించడంలో నిర్లక్ష్యం చూపారన్న ఆరోపణలున్నాయి. హెూమ్ ఓటింగ్ అర్హులైనప్పటికీ బి ఎల్ వో లు, రెవెన్యూ అధికారులు ఇంటి వద్దకు వెళ్లి వారి నుండి తమకు హెూం ఓటింగ్ వద్దని తెల్ల కాగితంపై రాయించి, వారి దగ్గర సంతకాలు చేసుకుని అనర్హులుగా చేశారని కొంతమంది వద్ధులు, ప్రత్యేక ప్రతిభావంతులు, బెడ్ రెస్టెడ్ పేషెంట్లు బహిరంగంగానే బిఎల్ఓలపై విమర్శలు చేస్తున్నారు.

ఎన్నికల కమిషన్‌కు కృతజ్ఞతలు

ఎ.కృష్ణయ్య, తిమ్మరాజుపల్లి, ఆర్‌సిపురం

నా పేరు ఎ.కష్ణయ్య, నా వయస్సు 92 సంవత్సరాలు. నేను మంచానికి పరిమితమయ్యాను. నా ఓటును 2024 ఎన్నికల్లో వేస్తానో..... వేయలేనో అని బాధపడేవాడిని. కేంద్ర ఎన్నికల కమిషన్ మాలాంటి వారి వారికోసం అధికారులను మంచం దగ్గరికి పంపి మా ఓటు హక్కు వినియోగించుకునేలా చేసినందుకు ఎన్నికల సంఘానికి కతజ్ఞతలు.

ఈసారి కష్టం తప్పింది : లక్ష్మమ్మ, కొత్తవేపకుప్పం

నా పేరు లక్ష్మమ్మ, నేను దీర్ఘకాలిక వ్యాధితో మంచంలోనే ఉన్నాను. నేను ఓటు హక్కు వినియోగించుకునేందుకు గతంలో అయితే మంచంలో మోసుకుని వెళ్లడమో, చక్రాల కుర్చీ నెట్టుకునో వెళ్లాల్సి వచ్చేది. అధికారులు నా దగ్గరకు వచ్చారు. ఓటు వేయమన్నారు.... ఓటు వేసేసాను. నా కోరిక తీరింది.

ఓటు వజ్రాయుధం: గురమ్మ, ప్రత్యేక ప్రతిభావంతురాలు, కమ్మకండ్రిగ

నా పేరు గురమ్మ, మాది కమ్మ కండ్రిగ గ్రామం. నేను ప్రత్యేక ప్రతిభావంతురాలిని. రెండు కాళ్లు పనిచేయవు. మంచానికే పరిమితం..... నడిచి పోలింగ్ కేంద్రానికి వెళ్ళడానికి చాలా ఇబ్బంది... ఈసారి ఎన్నికల అధికారులు ఇంటి వద్దకే వచ్చి నాకు ఓటును వినియోగించుకునేందుకు అవకాశం కల్పించారు. చాలా ఆనందంగా ఉంది.

తిరుపతిలో మౌలిక వసతులు కల్పించింది టిడిపినే: దినకర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి పట్టణంలో తెలుగుదేశం పార్టీ హయాంలోనే దీర్ఘకాలిక సదుపాయాలను, మౌలిక వసతులను ఏర్పాటు చేశామని టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమిదలపాటి దినకర్ స్పష్టం చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతి పట్టణంలో అంతా అభివద్ధి తామే చేశామని భూమన కరుణాకర్ రెడ్డి చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వి రమణ భూమన కరుణాకర్ రెడ్డికి తిరుపతి న్యాయస్థానాల సముదాయాల దుస్థితిని వివరించి వాటి స్థానంలో కొత్త భవనాలను నిర్మించాలని సూచించినా పట్టించుకోలేదని, తిరుపతి న్యాయస్థానాలకు కొత్త సముదాయాన్ని నిర్మించుకోవడానికి కోరుకున్న స్థలాన్ని ఫైవ్ స్టార్ హెూటల్ కి ఎన్ని ముడుపులు తీసుకొని కేటాయించారో చెప్పాలన్నారు. లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణ మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ద్వారా ప్రజల ఆస్తులకు ముప్పు ఉందన్నారు. కొంతమంది అవగాహన లేనివారు ఈ చట్టం మంచిదని చెప్పడం దారుణం అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ చట్టాన్ని రద్దు చేస్తామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో లీగల్ సెల్ జిల్లా నాయకులు మనోహర్, శాలివాహన సంఘం నాయకులు ఆముదాల తులసీదాస్ పాల్గొన్నారు.

దోబీఘాట్లో శిథిలావస్థలో విద్యుత్ స్తంభం

పది నెలలుగా పట్టించుకోని విద్యుత్ శాఖ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

రజకుల సౌకర్యార్థం దోబీఘాట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయగా 2002లో అప్పటి ప్రభుత్వం చెన్నాయగుంటలో ఎకరా స్థలం కేటాయించింది. రజకులంతా ఉమ్మడిగా విరాళాలు వసూలు చేసుకుని చుట్టూ ప్రహరీ కట్టుకున్నారు. విద్యుత్ కనెక్షన్ తీసుకున్నారు. అయితే కాలక్రమంలో దోబీఘాట్ వద్ద ఉన్న విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరుకుంది. పది నెలలుగా మంగళం సబ్‌స్టేషన్ విద్యుత్ శాఖ ఎఇ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని శ్రీ వీరభద్రస్వామి రజక వృత్తిదారుల సహకార సంఘం అధ్యక్షులు నిమ్మనపల్లి మునిరత్నం ఆరోపించారు. రజకులు బట్టలు ఉతికే సమయంలో ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యులని ప్రశ్నిస్తున్నారు. తాజాగా ఇటీవల అర్ధరాత్రి పెద్దఎత్తున గాలులు రావడంతో విద్యుత్ తీగ తెగి దోబీఘాట్ నేలపై పడింది. గమనించిన కమిటీ నాయకులు ఎఇ దృష్టికి మరోసారి తీసుకెళ్లారు. అయినా స్పందన లేకపోవడంతో మీడియా దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్ స్తంభాన్ని మార్పుచేసి, తీగలను సరిజేయాలని డిమాండ్ చేస్తున్నారు.

విద్యుత్ వైర్లను చూపిస్తున్న నిమ్మనపల్లి మునిరత్నం

(మొదటి పేజీ తరువాయి)

ఆర్‌కె రోజాను ఆదరించండి

భానుప్రకాష్ వెంట భార్య, తల్లి, తమ్ముడు ఎవరూ ప్రచారం చేయకపోవడాన్ని ఓటర్లు గుర్తించాలన్నారు. తన కుటుంబ సభ్యులంతా తన వెంట ఉన్నారన్నారు. చిత్తూరు ఎంపి అభ్యర్థి రెడ్డెప్ప, జీడి నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కపారాణి, ఆర్కే సెల్వమణి, మున్సిపల్ చైర్మన్ ఏ హరి, వైస్ చైర్మన్లు డి జయ ప్రకాష్, డి శంకర్, కౌన్సిలర్లు ఏకాంబరం పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి : జెవివి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జన విజ్ఞాన కమిటీ జిల్లా కార్యదర్శి రెడ్డప్ప, ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు మల్లేశ్వరరావు, డాక్టర్ బాలాజీ సంయుక్తంగా తెలిపారు. శనివారం జెవివి ఆధ్వర్యంలో పీపుల్స్ మేనిఫెస్టోను యశోద నగర్ నందలి వేమన విజ్ఞాన కేంద్రంలో విడుదల చేశారు. బాలాజీ మాట్లాడుతూ ప్రజలందురూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఓటుకు నోటును తిరస్కరించాలని ప్రజలను కోరారు. విద్య, వైద్య రంగాలకు కలిపి జిడిపిలో 9 శాతం నిధులు కేటాయించుటకు రాజకీయ పార్టీలు హామీ ఇవ్వాలని విజ్ఞప్తి చేసారు. మల్లేశ్వర రావు మాట్లాడుతూ సైన్సు పరిశోధనలకు బడ్జెట్లో 3 శాతం నిధులు కేటాయించాలని రాజకీయ పార్టీలను కోరారు. అప్పుడే దేశం అభివద్ధి చెంద గలదని వివరించారు. వ్యవసాయ, ఆరోగ్య, పర్యావరణ, విద్య, జలవనరులకు అధికంగా నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టెంకాయల దామోదరం, రఫీ, నాగార్జున, లక్ష్మీనారాయణ, మునిలక్ష్మి, బిర్లా నాయుడు, ఆనంద్, రామ కష్ణ, గురునాదం పాల్గొన్నారు.

రాజకీయ లబ్దికోసమే దుష్ప్రచారం: నరహరి రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)రాష్ట్ర ప్రజల ఆస్తుల సంరక్షణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు సవరణలు చేసి అమలు చేయాలని ప్రభుత్వం భావించినా తెలుగుదేశం పార్టీ తన రాజకీయ లబ్ధి కోసం యాక్ట్ పై దుష్ప్రచారం కల్పించడం బాధాకరమని వైసిపి లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు నరహరిరెడ్డి అన్నారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశ ప్రజల ఆస్తుల రక్షణ కోసం నేషనల్ ల్యాండ్ రికార్డ్ మోడ్రనైజేషన్‌లో భాగంగా ఈ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను తీసుకొచ్చిందన్నారు. 2022లో అసెంబ్లీలో ఈ బిల్లును ప్రవేశపెట్టినప్పుడు టిడిపి ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఈ యాక్ట్ చాలా అద్భుతమైనదని, ఇప్పట్లో ఈ చట్టం రావడం శుభ పరిణామం అని కూడా అన్నారని గుర్తు చేశారు. ఈ విలేకరుల సమావేశంలో చంద్రశేఖర్ రెడ్డి, మోహన్ కుమార్ పాల్గొన్నారు.

'కుమ్మర కుటుంబంపై దాడి దారుణం'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

శ్రీకాళహస్తి నియోజకవర్గం భీమవరం గ్రామంలో నివాసముంటున్న కుమ్మర సామాజిక వర్గానికి చెందిన సచివాలయ ఉద్యోగి కిరణ్ ఇంటిపై అధికార వైఎస్ఆర్సిపి కార్యకర్తలు పోస్టల్ బ్యాలెట్ ఓటు ఇవ్వలేదన్న కారణంగా ఇంటిపై దాడి చేసి ఆస్తి నష్టం కలిగించారని, ఈ ఘటనపై ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకోవాలని తిరుపతి పార్లమెంటు బీసీ శాలివాహన సాధికార సమితి అధ్యక్షులు ఆముదాల తులసీదాస్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వైసిపి హాయంలో వెనుకబడిన తరగతులకు చెందిన ప్రజలపై దాడులు తీవ్రమైపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న కూటమి ప్రభుత్వంలో దాడులకు తెగబడిన వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి

చిత్తూరు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: రిటన్నింగ్ అధికారి నుంచి అనుమతులు పొందిన ప్రతి వాహనాన్ని తప్పకుండా తనిఖీ చేయాలని జిల్లా జాయింట కలెక్టర్, చిత్తూరు అసెంబ్లీ నియోజక వర్గం రిటన్నింగ్ అధికారి పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం జెసి సమావేశం హాల్‌లో డిఎస్‌పి రాజగోపాల్ రెడ్డి, ఏఆర్‌ఓలు డాక్టర్ జె.అరుణ, విజయలక్ష్మి, శ్రీనివాసులు రెడ్డిలతో కలసి ఎన్నికల సందర్భంగా నిర్వహించాల్సిన వివిధ అంశాలపై ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ, సెబ్, పోలీసు అధికారులు లా అండ్ ఆర్డర్, ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, విఎస్‌టి, యంసిసి టీమ్స్ నోడల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఈ నెల 13న ఎన్నికలు జరుగనున్న సందర్భంగా అధికారు లు ప్రతి వాహనంతో పాటుగా ఆర్‌ఓ నుంచి పర్మిషన్ పొందిన రాజకీయ పార్టీల ప్రచారాల వాహనాలను తప్పకుండా తనిఖీ చేయాలని, వీటి ద్వారా మద్యం, డబ్బులు అక్రమంగా రవాణా జరిగే అవకాశం ఎక్కువుగా ఉంటుందని, వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇతర ప్రాంతాల నుంచి మద్యం డబ్బులు అక్రమ రవాణా జరగకుండా పోలిస్ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. 13న ఎన్నికలు జరుగనున్న సందర్భంగా జిల్లాలో ఉన్న 113మద్యం షాపులు, మద్యం షాపుల ద్వారా అమ్మకాలు, బార్లు రెస్టారెంట్లను శనివారం సాయంత్రం 6గంటల నుంచి మూయించేయాలని ఎక్సైజు శాఖ అధికారులను ఆదేశించారు. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో యన్‌ఆర్ పేట, గుడిపాల, ముత్తరాసికుప్పం, గొల్ల మడుగు వద్ద ఉన్న చెక్ పోస్టులలో 24గంటలు గట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఇతర ప్రాంతాల నుంచి మద్యం, డబ్బులు గానీ ఏది రాకూడదన్నారు. ఎన్నికల రోజు లాండ్ ఆర్డర్‌కు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా 29రూట్స్ మొబైల్స్ పోలీస్ ఫోర్సు అందుబాటులో ఉంటారని, ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ముగ్గురు పోలీసు సిబ్బందిని క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసుతో సెంట్రల్ పోర్స్ ఐదుగురు సిబ్బంది ఉంటారని తెలిపారు. రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించి ఎన్నికలలో ఎలాంటి ఇబ్బంది జరగకుండా సహకరించాలని, ఏమైనా ఇబ్బందులు కలిగిస్తే కఠిమైన చర్యలు తీసుకుంటామని తెలపాలని లా అండ్ ఆర్డర్ నోడల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. ప్రోహిబిషన్, ఎక్సైజ్ శాఖ పర్యవేక్షకులు ఆయూషా బేగం మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ నిర్వహించే 113 మద్యం షాపులు ఉన్నాయని, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దుల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేయడం జరిగిందని, తమిళనాడు కర్ణాటక రాష్ట్రాల ఎక్సైజ్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించామని, ఆయా రాష్ట్రాల నుంచి మద్యం సరఫరా రాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని వారికి సూచించామని ఆర్‌ఓకు వివరించారు. శనివారం సాయంత్రం 6గంటల నుంచి జిల్లాలోని అన్ని మద్యం షాపులను బార్లు రెస్టారెంట్లు మూసివేయాలని ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ఈ సమావేశంలో అధికారులు డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి, చిత్తూరు, గుడిపాల ఎంపీడీవోలు రాజశేఖర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఈ నెల 13వ తేదీ నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నిర్వహణ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అందరూ రిటర్నింగ్ అధికారులు, ఎఆర్ఓ లతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడుతూ ఈ సార్వత్రిక ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి కావాలని సూచించారు. బడ్జెట్ అంశాలపై సమీక్షిస్తూ శనివారం, ఆదివారం సెలవు దినాలు కావడంతో పోలింగ్ నిర్వహణకు బిల్స్ అప్‌లోడ్, డిసి బిల్లులు ముందే బ్యాంకు నుండి డ్రా చేసి భద్రపరచుకోవాలి అని, టిఏ, డిఏను పిఓ, పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్, తదితర వాటికి ఇవ్వాల్సిన ఉన్న నేపథ్యంలో అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఏర్పాట్లలో ఎక్కడా నిర్లక్ష్యం కనిపించ కూడదని తెలిపారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల్ కిషోర్, రిటర్నింగ్ అధికారులు తదితర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెరిగేందుకు సహకరించాలి

తిరుపతి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అదితి సింగ్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ఈనెల 13వ తేదీ జరిగే పోలింగ్ రోజున ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా పోలింగ్ ప్రక్రియ స్వేచ్ఛాయుత వాతావరణంలో, ప్రశాంతంగా, సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీలు సహకారం అందించాలని జనరల్ అబ్జర్వర్ ఉజ్వల్ కుమార్ ఘోష్, 167-తిరుపతి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అదితి సింగ్‌లు రాజకీయ ప్రతినిధులను కోరారు. 167-తిరుపతి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయం (అర్బన్ తహశీల్దార్) లో శుక్రవారం సార్వత్రిక ఎన్నికలు-2024 కు సంబంధించి పోలింగ్ కు ముందు చివరి 72 గంటల ప్రొటోకాల్, ఎన్నికల సన్నద్ధత, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, తదితర అంశాలపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో, ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ అబ్జర్వర్ ఉజ్వల్ కుమార్ ఘోష్, 167- తిరుపతి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అదితి సింగ్ లు మాట్లాడుతూ జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఎక్కడైనా చిన్న చిన్న సమస్యలు తలెత్తితే సంయమనం పాటించాలని అలాంటి సమస్యను తమ దృష్టికి నేరుగా తీసుకు రావచ్చన్నారు. పోలింగ్ రోజున తాము అందుబాటులో ఉంటామని ఏమైనా సమస్య తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం పోలింగ్ తేదికి 48 గంటల ముందు అనగా ఈనెల 11వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి ప్రచారం ఆపేయాల్సి వుంటుందన్నారు. పోలింగ్ కేంద్రాల ప్రవేశ మార్గం నుంచి 200 మీటర్ల పరిధి పైన మాత్రమే తాత్కాలిక కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవాలని అందులో టేబులు, కుర్చీలకు, ఒక బ్యానరు, ఒక జెండా ఉంచుకునేందుకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఆ ప్రదేశం ఎక్కువమంది గుమ్మిగూడి ఉండకూడదని స్పష్టం చేశారు. పోలింగ్ రోజున ఆయా పార్టీల పోలింగ్ ఏజెంట్లు ఉదయం 5 గంటలకే పోలింగ్ కేంద్రానికి చేరుకునేలా రాజకీయ పక్షాలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయాన్ని అందరికి తెలపాలన్నారు. మాక్ ఫోల్ నిర్వహించిన అనంతరం బటన్ తప్పనిసరిగా క్లోజ్ చేసేలా పరిశీలించు కోవాలన్నారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కావాలన్నారు. ఆయా నియోజకవర్గాల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు ఈనెల 12వ తేదీన ఉదయం 7 గంటలకే ఈవిఎంల భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ కు సంబంధిత రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరు కావాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ ఉంటుందన్నారు. ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేం దుకు కేంద్ర బలగాలతో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఆయా అభ్యర్థులకు అనుమతించిన వాహనాల్లో ఆ నియోజకవర్గానికి సంబంధించిన వ్యక్తులు మాత్రమే ప్రయాణం చేయాల్సి వుంటుందని ఈ విషయంలో వారిపేర్లు ముందు తమకు తెలపాల్సి వుంటుందన్నారు. ఈ సమావేశంలో డి ఎస్ పి., డెప్యూటీ కమిషనర్ అమరయ్య, తహశీల్దారు నారాయణ రెడ్డి, ఎన్నికల డిటిజీవన్, పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యాలి: లాయర్ పార్థసారథి రెడ్డి

ప్రజాశక్తి -నాయుడుపేట: నాయుడుపేటలో అనేక అభివృద్ధి వనరులు ఉన్నప్పటికీ వైసిపి నాయకులు నాయుడుపేటని అభివృద్ధికి నోచుకోనీయకుండా ప్రజలను మోసం చేశారని వైసీపీ నాయకులకు బుద్ధి చెప్పేందుకు అభివృద్ధికి కృషి చేసేవారిని గుర్తించి ఓటెయ్యాలని నాయుడుపేట బార్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు వెందోటి పార్థసారథి రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం నాయుడుపేట లోని ఆయన కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్థసారథి రెడ్డి మాట్లాడుతూ నాయుడుేఏటని అభివృద్ధి చేసే అవకాశాలు ఎన్నో ఉన్నా వాటిని నాయుడుపేట దరిచేరనీయకుండా వైసీపీ నాయకులు అభివృద్ధిని ఆటకెక్కించారని ప్రతి ఒక్కరూ ఆలోచించి ఎలక్షన్లో వారికి సరైన బుద్ధి చెప్పాలని అందుకోసం ఎన్‌డిఏ కూటమి తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపూడి వరప్రసాద రావుని, సూళ్లూరుపేట నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీని గెలిపించాలని పిలుపు నిచ్చారు. వైసీపీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య నాయుడుపేటని ఏ రోజూ పట్టించుకోలేదని, అలా ఆలోచించి ఉంటే ఎన్నో కార్యాలయాలు వచ్చి ఉండేవని అవి తీసుకురాలేకపోగా, నాయుడుపేటలో వున్న ఆర్డీవో కార్యాలయాన్ని సూళ్లూరు పేటకు తరలించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆర్డీవో కార్యాలయాన్ని సూళ్లూరుపేటకు తరలిస్తున్నప్పుడు ఎంతోమంది వారించినా, ఉద్యమాలు చేసినా ఆయన ఏ ఒక్కరిని లెక్క పెట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాయుడు పేటకు సబ్ కలెక్టర్, సూపరింటెండెంటు కార్యాలయాలు వచ్చే అవకాశాలు ఉన్నప్పటికీ వాటిపై ఏరోజు శ్రద్ధ చూపలేదని ఆ కార్యా లయాలు నాయుడు పేటకు వచ్చి ఉంటే ఎంతో మందికి ఉపాధి అవకాశాలు దొరికేవన్నారు. ఎంతో అభివృద్ధి కనిపించి ఉండేదని ఈ ఐదేళ్లలో వైసీపీ నాయకు లు నాయుడు పేటను ప్రజలను వాడుకున్నారే తప్ప నామ మాత్రపు అభివృద్ధి చేసిన దాఖలాలు లేవన్నారు. ఇవన్నీ ఆలోచించి ప్రజలు వారికి గట్టిగా బుద్ధి చెప్పాల న్నారు. ఈ సమావేశంలో లాయర్ ఎ చెంచు కృష్ణయ్య మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైసిపి నాయకులు రాష్ట్రానికి చేసిన అభివృద్ధి లేకపోగా రాష్ట్ర ప్రజల ఆస్తులను లాక్కునేందుకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొచ్చారని ఇది

మాట్లాడుతున్న లాయర్లు

చాలా దుర్మార్గమైన జీవో అని ఇది అమలులోకి వస్తే ప్రజల బతుకే కనుమరుగ వుతుందని దీన్ని ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండించాలని మళ్లీ వైసిపి ప్రభుత్వం వస్తే ప్రజలకు వాళ్లకున్న చెట్టు పుట్ట ఏదీ దక్కదని దీనిపై తమ లాయర్ల అసోసియేషన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిందని దీనిపై ప్రజలు క్షుణ్ణంగా తెలుసుకో వాలన్నారు. ఈ యాక్ట్ గురించి మీడియా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలు కాకుండా ఉండాలంటే వైసిపిని ఓడించడం ఒకటే మార్గమని తెలిపారు. ఈ కార్యక్రమంలో లాయర్లు జి వీరాస్వామి, కె శ్రీనివాసులు మొదలియార్, పసల చెంగయ్య, పసల గంగా ప్రసాద్, పేర్నాటి కిరణ్ కుమార్, ఎ పరుశురామయ్య, బిక్కీ, చిరంజీవిబాబు, టి గోపికృష్ణ, ఎం సుధీర్, యు సురేష్ పాల్గొన్నారు.

నేడు చిత్తూరు కి చంద్రబాబు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఎన్నికల ప్రచారంలో భాగంగా టిడిపి నిర్వహిస్తున్న ప్రజాసంకల్ప యాత్ర చివరి రోజైన శనివారం చిత్తూరులో టిడిపి భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. ఈ బహిరంగ సభలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారు. ఎన్నికల ప్రచారం చివరి రోజైన శనివారం జిల్లా కేంద్రమైన చిత్తూరులో టిడిపి భారీ బహిరంగ సభను మెసానికల్ క్రీడా మైదానంలో నిర్వహించనుంది. తమ పార్టీ అధినాయకుడు నారా చంద్రబాబు నాయుడు బహిరంగ సభలో పాల్గొననుండడంతో టిడిపి శ్రేణులు భారీ జన సమీకర ణకు సన్నాహాలు చేస్తున్నాయి. చిత్తూరు అర్బన్, రూరల్, గుడిపా ల మండలాల నుండి జన సమీకరణలో టిడిపి శ్రేణులు నిమగ్న మయ్యాయి. శుక్రవారం బహిరంగసభ నిర్వహించనున్న మెసాని కల్ క్రీడా మైదానాన్ని టిడిపి జిల్లా నాయకత్వం పరిశీలించారు.

జనసేనలో యువ నాయకుడు సుధ చేరిక

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి నగరంలో వైసిపికి గట్టి షాక్ తగిలింది. స్థానిక జీవకోనలో యువ నాయకుడు సుధా ఆధ్వర్యం లో 600 మంది వైసిపి యువజన విభాగం కార్యకర్తలు శుక్రవా రం జనసేనలో చేరారు. జనసేన సీనియర్ నేత పొలకల మల్లికార్జున్, నగరాధ్యక్షుడు రాజారెడ్డి సమక్షంలో వారందరికి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు కండువా కప్పి జనసేనలోకి ఆహ్వానించారు. దీంతో జనసేనకు కొండంత బలం చేకూరిందని టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఉమ్మడి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ధీమా వ్యక్తం చేశారు.

తిరుపతి(మంగళం): వైసీపీలో కొనసాగిన మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దొడ్డారెడ్డి శ్రీనివాసులు రెడ్డి కూటమి తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు సమక్షంలో శనివారం జనసేన లో చేరారు. ఇటీవల జనసేనలో చేరిన నెలవాయి మురళీకృష్ణ సహకారం తో శ్రీనివాసరెడ్డి తన అనుచర వర్గంతో కలిసి జనసేన పార్టీలో చేరారు. వీరికి ఆరణి శ్రీనివాసులు కండువా కప్పి సాదరం గా పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీలో క్యాడర్ కు తగిన ప్రాధాన్య త ఇవ్వడం లేదని, అందుకే జనసేనలో చేరానని శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. దొడ్డారెడ్డి మహేందర్ రెడ్డి, సి.కె రవి, మురళీ, వెంకటేష్ రాయల్, బాలు, మునిరెడ్డి, కృష్ణ, రామకృష్ణ రెడ్డి, సురేష్ రెడ్డి, పి.మునికృష్ణ, బి.విష్ణు వర్ధన్, పృథ్వీరెడ్డి, నవీన్ రెడ్డి, రమేష్ రెడ్డి, కేశవ రెడ్డి దొడ్డారెడ్డి శ్రీనివాసులు రెడ్డితో కలిసి జనసేన పార్టీ కండువా కప్పుకున్నారు. ఆరణి శ్రీనివాసులు గెలుపుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

వైసిపి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: వైసిపి నాయకుల ఆధ్వర్యంలో మండలంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. పార్లమెంట్ అభ్యర్థి మద్దిల గురుమూర్తి, అసెంబ్లీ అభ్యర్థి నూకతాటి రాజేష్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మాట్లాడుతూ 13వ తేదీ నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికలలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశీస్సులతో వైసిపి నుండి మరోసారి తిరుపతి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గురుమూర్తిని ఫ్యాను గుర్తుపై ఓటును వేసి గెలిపించాలని కోరారు. సత్యవేడు నియోజకవర్గం అసెంబ్లీ అభ్యర్థిగా నూకతోటి రాజేష్ అత్యధికంగా మెజారిటీతో గెలిపించాలని నాయకులు కోరారు. ఎలాంటి లాభాపేక్ష, స్వార్థం, పక్షపాతం లేకుండా తిరుపతి పార్లమెంట్ ప్రజలకి సేవ చేసేందుకు తాను సిద్ధమని మన ప్రాంత అభివృద్ధి కాంక్షిస్తూ ఫ్యాను గుర్తుకు ఓటేసి జగనన్నకు, జగనన్న నిలిపిన అభ్యర్థులకు మద్దతు తెలిపేందుకు అందరూ సిద్ధం కావాలన్నారు.

కబ్జా భూములను రక్షిస్తా: పులివర్తి నాని

ప్రజాశక్తి -రామచంద్రాపురం: తిరుపతి రూరల్ మండలంలో తిరుచానూరు పంచాయతీలోని చైతన్యపురం, అంబేద్కర్ కాలనీ తదితర ప్రాంతాల్లో పేదలు నిర్మించుకున్న ఇళ్ల పట్టాలు రెగ్యులరైజ్ చేస్తానని చంద్రగిరి నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. శుక్రవారం తిరుచానూరులో టిడిపి భారీ బహిరంగ సభ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని, చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సిఆర్ రాజన్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాద్ రావు, టీడీపీ సీనియర్ నేత మబ్బు దేవనారాయణ రెడ్డి, జనసేన ఇన్‌ఛార్జ్ దేవర మనోహర్ లు హాజరయ్యారు. ప్రజలను ఉద్దేశించి పులివర్తి నాని మాట్లాడుతూ మాజీ మంత్రి గల్లా అరుణకుమారి హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప, తర్వాత జరిగింది శూన్యమన్నారు. కబ్జా కోరల్లో చిక్కుకున్న భూములను ఆ చెర నుంచి విడిపించి రక్షణ కల్పిస్తా మన్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా తిరుచానూరులో ప్రజలు సమస్యలు చెప్పుకుని కన్నీటిపర్యంత మయ్యారన్నారు. భూములు దౌర్జన్యంగా కబ్జా చేశారని, రౌడీయిజం, గంజాయి విక్రయాలు పెరిగిపోయాయని వాపోయారని చెప్పారు. నెల రోజుల్లో కబ్జాలకు గురైన భూములను స్వాధీనం చేసుకుని బాధితులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. బడుగు, బలహీన వర్గాల పార్టీ టిడిపి అన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే గా తనను, ఎంపీగా దగ్గుమల్ల ప్రసాద్ రావును గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షుడు సి ఆర్ రాజన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
చిత్తూరు - తిరుపతి
శనివారం 11
మే 2024

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ

- పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పూర్తయింది
- 17741మంది ఉద్యోగులు, 495మంది హోం ఓటింగ్ పూర్తి
- మీడియా సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి షన్మోహన్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అన్ని రకాల చర్యలు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.షన్మోహన్ తెలిపారు. శుక్రవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో ఎన్నికల సన్నద్ధతపై ఎస్పీ మణికంఠ చందోలుతో సంయుక్తంగా మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పూర్తి అయిందని, 17,741 మంది ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, ఇందులో ఇతర జిల్లాలలో ఓటు హక్కు కలిగిన 3,400 మంది ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో 90శాతం మంది తమ పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడానికి అధికార యంత్రాంగం కృషి చేసిందని తెలిపారు. హోం ఓటింగ్‌కు 566మంది దరఖాస్తు చేసుకోగా 495మంది ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. ఎన్నికల విధివిధానాలను ఆయన క్షుణ్ణంగా వివరించారు. ఈ నెల 12న ఉదయం పోలింగ్ సిబ్బందికి కేటాయించిన బూత్‌ల వివరాలను డిస్పాచ్ సెంటర్‌లలో నోటిస్ బోర్డులలో ఉంచుతామన్నారు. పోలింగ్ ప్రక్రియకు సంబంధించి ఉపకరణాలను పోలింగ్ సిబ్బందికి సమకూర్చి 12న మధ్యాహ్నం పోలింగ్ స్టేషన్‌లకు తరలించడం జరుగుతుందన్నారు. ఎన్నికల రోజు ఉ.5.00గం.ల నుంచి సిబ్బంది పోలింగ్ కేంద్రాలలో అందుబాటులో ఉంటారని, ఉ.5.30 గం.లకు మాక్ పోల్ నిర్వహణ ఉంటుందని, ఉ.7.00 ల నుండి ఓటింగ్ ప్రారంభించి సా.6.00 గం లోపు పోలింగ్ స్టేషన్ చేరుకున్న ఓటర్లకు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. ఎన్నికల విధులలో పాల్గొంటున్న సిబ్బందికి అవసరమైన కనీస మౌలిక సదుపాయాలను కల్పించడం పూర్తి అయ్యిందన్నారు. ఈ నెల 11న సా.6.00 గం.ల నుండి 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎటువంటి ప్రచారాలు, ర్యాలీలు నిర్వహించరాదని, ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యే వరకు మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్ లు పూర్తిగా మూసి సీల్ వేయడం జరుగుతుందన్నారు. చివరి 48గం.ల సమయంలో తక్కువ మందితో ఇంటింటి ప్రచారానికి అనుమతి ఉందన్నారు. పలమనేరు, పుంగనూరు, కుప్పంలో పూర్తి స్థాయిలో వెబ్ కాస్టింగ్ నిర్వహించాలని ఎన్నికల ఆదేశాలున్నాయని, ఇంటర్ నెట్ సౌకర్యం లేని ప్రదేశాలలో సిసి కామెరాలు లేదా వీడియో కెమెరాను ఏర్పాటు చేస్తామన్నారు. దాదాపుగా రూ.4.70 కోట్ల నగదును సీజ్ చేయడం జరిగిందన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, ఆర్ఓ కార్యాలయాల స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సామాన్య ప్రజలు ఫిర్యాదుల కొరకు సి-విజిల్ యాప్ ను వినియోగించుకోవచ్చునన్నారు. ఓటరు తమ స్వంత వాహనాలను పోలింగ్ స్టేషన్ కాంపౌండ్ వరకు అనుమతించడం జరుగుతుందని, వాహనాలపై ఎటువంటి రాజకీయ గుర్తులు ఉండకూడదన్నారు. సమావేశంలో చిత్తూరు రిటర్నింగ్ అధికారి పి.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే మా ధ్యేయం

- సంక్షేమం, ఉపాధి, ఉద్యోగాల కల్పనకు కృషి
- పేద వర్గాలను ఆదుకుంటాం
- కుప్పం ఎన్నికల ప్రచారంలో టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ

ఎన్నికల ప్రచారంలో దగ్గుమళ్ళ ప్రసాదరావు

ఎంఆర్‌పీఎస్ సభలో మాట్లాడుతున్న దగ్గుమళ్ళ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామని, చంద్రబాబు సీఎం అయిన వెంటనే అభివృద్ధి పరుగులు పెడుతుందని టీడీపీ చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు స్పష్టం చేశారు. శుక్రవారం కుప్పంలో ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్, కుప్పం మున్సిపల్ పరిధి పార్టీ అధ్యక్షులు రాజకుమార్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లోకి బలంగా వెళ్లిందన్నారు. కుప్పంలో చంద్రబాబును లక్ష ఓట్ల మెజారిటీ లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. ఐదేళ్ళలో అరాచకాలకు విసిగిపోయిన జనం వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పేందుకు ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. అనంతరం ప్రచారంలో భాగంగా 23, 24 వార్డుల్లో పర్యటిస్తూ టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

అంబేద్కర్ స్ఫూర్తితో దళితులు ముందుకు సాగాలి

చిత్తూరు అర్బన్: రాజ్యాంగ నిర్మాత, దళితుల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో దళితులు ముందుకు సాగాలని, సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఎన్‌డీఏ కూటమి చిత్తూరు పార్లమెంట్ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు. కుప్పం నియోజకవర్గం, రామకుప్పం మండలం, బందార్లపల్లి పంచాయతీ, గడ్డూరు గ్రామంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ కుప్పం నియోజకవర్గ మాదిగల ఆత్మీయ సమ్మేళన సదస్సును నిర్వహించారు. రిటైర్డ్ ఎస్పి స్వామి నేతృత్వంలో జరిగిన ఈ ఆత్మీయ సదస్సుకు ఉమ్మడి అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. అంతకుముందు గడ్డూరుకు చేరుకున్న ప్రసాద్ రావుకు టిడిపి, బిజెపి, జనసేన పార్టీల నాయకులతో పాటు ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, దళిత ప్రజలు ఘన స్వాగతం పలికారు. ముందుగా గడ్డూరులో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ప్రసాదరావు దళిత నేతలతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు గడ్డూరులో నెలకొన్న సమస్యలను ప్రసాదరావు దృష్టికి తెచ్చారు. తామంతా టిడిపి వెంటే నడుస్తున్నామని, ప్రసాదరావు గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని ఉద్ఘాటించారు. దీనికి సానుకూలంగా స్పందించిన దగ్గుమళ్ళ తాను పేద వర్గాలకు అండగా నిలుస్తానని భరోసానిచ్చారు. దళితులంతా స్వశక్తితో బతికే అవకాశాలను కల్పిస్తానని తెలిపారు. అలాగే గడ్డూరులో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దళితుల శ్రేయస్సు కోసం పాటుపడుతున్న తెలుగుదేశం పార్టీకి బాసటగా నిలవాలని, ఈ సార్వత్రిక ఎన్నికల్లో కుప్పం నుంచి చంద్రబాబు నాయుడుని లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. అదేవిధంగా తనను కూడా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు.

భూములు కాజేసేందుకే ల్యాండ్ టైటిలింగ్ చట్టం

- వైసీపీ నుంచి భూములు కాపాడుకుందాం
- టీడీపీకి మద్దతివ్వండి
- మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి పిలుపు
- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రతులు దగ్ధం చేసి నిరసన

ప్రజాశక్తి-గంగవరం, పలమనేరు: ప్రజల భూములను కాజేసేందుకే వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని తీసుకొచ్చిందని మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ల్యాండ్ టైటిల్ యాక్ట్ ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఇప్పటివరకు బిజెపి రాష్ట్రాలతో సహా ఏ రాష్ట్రము ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలు చేయలేదన్నారు. ఆ చట్టం చేయడానికి జగన్‌రెడ్డి ఎందుకు తొందర పడ్డారని, ప్రజల భూములు కబ్జా చేసేందుకే జగన్ రెడ్డి ప్రభుత్వం ఈ చట్టం తెచ్చిందన్నారు. ల్యాండ్, సాండ్, వైన్, మైన్, గంజా, డ్రగ్స్, ఎర్రచందనం లాంటివి కొల్లగొట్టడం ద్వారా కోట్ల రూపాయల స్వాహా చేశారని ఆ సొమ్మును భూముల్లోకి తరలించడానికి సివిల్ కోర్టులు అడ్డంకిగా ఉన్నాయని కోర్టుల రక్షణను తొలగించడానికి రెవెన్యూ అధికారులకు సివిల్ కోర్టుల అధికారాలను కట్టబెడుతూ ఈ యాక్ట్ తెచ్చారన్నారు. రాష్ట్రంలో ఈ చట్టం 2023 అక్టోబర్ 31 నుంచే అమలులోకి వచ్చిందని, అయితే ఈ భూభక్ష చట్టంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. జగన్ రెడ్డి బినామీ కంపెనీ ఇండోసోల్‌కి వేలాది ఎకరాల రైతు భూములను కారు చౌకగా కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఇలా రాష్ట్రవ్యాప్తంగా జగన్ భూమాఫియా లక్షలాది ఎకరాలు కబ్జా చేయడానికి తొందర తొందరగా ఈ చట్టం చేశారని తెలిపారు. జగన్మోహన్ రెడ్డికి ఓటు వేయడమంటే మన భూహక్కులని మన ఆస్తి హక్కుల్ని అధికారాలని పూర్తిగా వైసీపీ నాయకులకు కట్టబెట్టినట్లే అవుతుందన్నారు. మన ఆస్తులకు మనం యజమానులుగా ఉండాలంటే వైసీపీ ప్రభుత్వాన్ని జగన్‌ను ఓడించాలని మన భూములకు రక్షణ ఉండాలంటే తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. వైసీపీని ఓడించి భూహక్కులు కాపాడుకుందాం అనే నినాదంతో ఈ ఎన్నికల్లో ప్రజలు నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆర్బిసి కుట్టి, సుబ్రమణ్యం గౌడు, అమరనాథ రెడ్డి, రవి, సుదర్శన్, బాలాజీ, దిలీప్, నాగరాజు పలువురు పాల్గొన్నారు.

మధుని ఆశీర్వదించండి: పెద్దిరెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: నిత్యం ప్రజల్లో నిలిచే బియ్యపు మధుసూదన్ రెడ్డిని రానున్న ఎన్నికల్లో కూడా ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం బియ్యపు మధుసూదన్ రెడ్డికి మద్దతుగా శ్రీకాళహస్తి పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటున్న మధుసూదన్ రెడ్డి అని కొనియాడారు. ఓటు వేసే ముందు శ్రీకాళహస్తి ప్రజలు అందరూ ఆలోచించి ప్రజా నాయకుడికి ఓట్లు వేయాలని సూచించారు. జగన్ ఇచ్చిన ఎన్నికల హామీలు అన్ని పూర్తి చేశారని తెలిపారు. రాబోయే ఐదేళ్లలో కూడా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పారు. చంద్రబాబు నాయుడు గతంలో 600హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారనీ, తాజాగా సుపర్ సిక్స్ పేరుతో ప్రజలను మరోసారి మోసం చేయాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

పరిశ్రమలు రాకపోవడానికి

రోజా కమిషన్లే కారణం: భాను

ఎన్నికల ప్రచారంలో గాలి భానుప్రకాష్

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పరిశ్రమలు రాకపోవడానికి రోజా కమిషన్లే కారణమని యువతను మోసం చేసి వడమాలపేట వెనుకబాటుకు ఆమె కారణం అని నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ ఆరోపించారు. శుక్రవారం వడమాలపేట మండలం ఎస్‌బిఆర్ పురం పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకిల్‌కు ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వడమాలపేట మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మణి రాజు, మాజీ సర్పంచ్ సుబ్రహ్మణ్యం యాదవ్, నాయకులు వెంకటయ్య, ధనుంజయ నాయుడు, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

ఆకు రౌడీలకు, సౌమ్యులకు మధ్య ఎన్నిక: భూమన

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: చిత్తూరు ఆకు రౌడీలకు, తిరుపతి సౌమ్యులకు మధ్య జరుగుతున్న ఎన్నికలు ఇవి అని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ నాన్ లోకల్ వ్యక్తి ఆరణి శ్రీనివాసులకి, తిరుపతిలో పుట్టి పెరిగి-అభివృద్ధిని శ్వాసగా పీలుస్తున్న అభినయ్‌కి మధ్య జరుగుతున్న యుద్ధమిది అని పేర్కొన్నారు. అవినీతిలో కూరుకున్న పాపాలపుట్ట ఆరణి శ్రీనివాసులుకి జీవితం అంటే త్యాగం-సేవ అనే ఆలోచనలతో పెరిగిన అభినయ్‌కి జరుగుతున్న పోరాటమిది అన్నారు. స్థానికుడు, తిరుపతిని నలభై ఏళ్ల ముందుకు తీసుకెళ్లిన ప్రజా కామికుడైన భూమన అభినయ్‌కే ఓట్లు వేయాలని ప్రజలు ఏకాభిప్రాయానికి వచ్చారన్నారు. తిరుపతి వాసులు అభినయ్ పక్షాన ఉన్నారు. చిత్తూరు నుంచి దొంగోట్లు వేయాలనే వారు మాత్రమే ఆరణి శ్రీనివాసులు వైపు ఉన్నారని తెలిపారు. వ్యక్తిగత స్వార్థం కడుపు నిండా దాచుకున్న వాళ్లే ఆరణి వైపు నిలబడ్డారని తెలిపారు. తిరుపతి మరింతగా ఆధ్యాత్మిక సంతరించుకోవాలని, మరింత అభివృద్ధి జరగాలని కోరుకునే వారు అభినయ్‌కే ఓట్లు వేయాలని నిర్ణయానికి వచ్చారన్నారు. తిరుపతి మాది అని భావిస్తున్న వారంతా చిత్తూరు వ్యక్తి శ్రీనివాసులుకి ఓట్లు వేయకూడదనే నిర్ణయంతో ఉన్నట్లు తెలిపారు. పక్కా లోకల్ అయిన భూమన అభినయ్‌నే గెలిపిద్దామని తిరుపతి ప్రజలు కంకణం కట్టుకున్నారని అభిప్రాయం వ్యక్తం చేశారు. మూడో డివిజన్ లక్ష్మీపురంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తమ్ముడు గణేష్, ఇతర కార్పొరేటర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి

- ఏఆర్‌వో, కమిషనర్ అరుణ వెల్లడి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: నగరపాలక పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాట్లు పూర్తి చేయాలని ఏఆర్‌వో, కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, వార్డు ఎమినిటీ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో బారికేట్ల నిర్మాణం, షామియానా, విద్యుత్ లైట్ల ఏర్పాట్లు సాయంత్రానికి పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఇప్పటికే పూర్తి చేసిన విద్యుదీకరణలో భాగంగా స్విచ్ బోర్డులు, లైట్లు, ఫ్యాన్లు సక్రమంగా పని చేస్తున్నాయో లేదో చెక్ చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో పెండింగ్ పనులన్నీ శుక్రవారం సాయంత్రానికి పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం పోలింగ్ కేంద్రాల్లో పారిశుద్ధ్య పనులు, మరుగుదొడ్ల నిర్వహణపై ప్రజారోగ్య విభాగం అధికారులు, వార్డు పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శులతో సమీక్షించారు. పోలింగ్ కేంద్రాలను శుభ్రం చేసి సంబంధిత ఫోటోలు పంపాలన్నారు. పోలింగ్ కేంద్రాల ఆవరణాలు, పరిసరాలను మరోసారి పరిశీలించి పారిశుద్ధ్య పరంగా ఏమైనా లోటుపాట్లు ఉంటే సత్వరం పూర్తి చేయాలని సూచించారు. మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎంఈ గోమతి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యలన్నీ పరిష్కరిస్తాం: మురళిమోహన్

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని పూతలపట్టు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కలికిరి మురళిమోహన్ అన్నారు. శుక్రవారం యాదమరి మండలం పరిధిలోని సంతగేటు తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్ళి తెలుగుదేశం పార్టీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంచారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లనున అభ్యర్థించారు. మురళిమోహన్ దృష్టికి తమ సమస్యలు పరిష్కరించాలని ప్రజలు విన్నవించారు. పాలకుల నిర్లక్ష్యం, భాధ్యతరాహిత్యం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో కనీస సౌఖర్యాలు కూడా కల్పించలేదంటూ వాపోయారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప కొత్తగా అభివృద్ధి జరగకపోగా సమస్యలు మరింత పెరిగాయని ప్రజలు తమ భాధలను మురళిమోహన్‌తో పంచుకున్నారు. గ్రామాల్లో వీధి దీపాలు, సీసీ రోడ్లు, పారిశుధ్య పనులు ఇలా చెప్పుకుంటూ పోతే అనేక సమస్యలు ఉన్నాయని చెప్పారు. అధికారంలోకి వచ్చిన 3నెలల వ్యవధితో అధికారులతో కలిసి గ్రామాలకు విచ్చేసి సమస్యలు తెలుసుకుని వాటిని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. నాయకులు జనార్ధన్ రావు, మురార్జీ యాదవ్, వెంకటేష్ రబ్బీ, సుభాష్ నాయుడు, కుమార్, టి.హేమగిరి చిట్టి, రాజమాణిక్యం, నిత్యానందం, అమరనాథ్ నాయుడు, చిత్రా నాయుడు, పాల్గొన్నారు.

ఆ నాలుగు స్థానాల బాధ్యత నాది

చంద్రబాబుకు గిఫ్ట్‌గా ఇస్తాం

కూటమి ప్రచారంలో కొండేపాటి గంగా ప్రసాద్

ప్రజాశక్తి-సూళ్లూరుపేట టీడీపీ విజయమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ప్రముఖ పారిశ్రామికవేత్త గంగాప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వెంకటగిరి, సూళ్లూరుపేట, గూడూరు, సత్యవేడు నియోజకవర్గాల గెలుపు బాధ్యత తన భుజస్కంధాలపై వేసుకుని శ్రమిస్తున్నట్లు మీడియాకు తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడుతున్నా, ఎపుడూ పదవులు, కాంట్రాక్టులు ఆశించలేదన్నారు. ఆయన అనుచరులు మాట్లాడుతూ పార్టీ అంటే ప్రాణంగా భావించి ఓ సైన్యాధిపతి లాగా ఎన్నికల సమరంలో వ్యూహాలు రచిస్తూ పార్టీ శ్రేణులకు కొండంత భరోసా ఇస్తూ కఠోర శ్రమతో అభ్యర్థుల విజయమే లక్ష్యంగా అడుగులు వేస్తూ తన వ్యాపారాల ద్వారా సంపాదించిన కోట్లాది రూపాయలను పార్టీ అభ్యర్థుల కోసం ఖర్చు చేస్తున్నారని ప్రముఖ పారిశ్రామికవేత్త గంగా ప్రసాద్‌ను కొనియాడారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ పై ఉన్న నమ్మకంతో 20 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీకి పెద్దదిక్కుగా వ్యవహరిస్తూ స్థానిక సంస్థలు ఎన్నికలతో పాటు అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో కొండేపాటి తిరుపతి జిల్లాలోని సూళ్లూరుపేట, గూడూరు,సత్యవేడు ఎస్సి రిజర్వు నియోజకవర్గాలతో పాటు వెంకటగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల గెలుపు బాధ్యతలను తన భుజస్కందాలపై వేసుకున్నారు. అభ్యర్థులు ఎంపిక నుండి ఎన్నికల్లో ఓటింగ్ జరిగే వరకు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ కొండంత సహకారం అందిస్తూ వస్తున్నారు. రాజకీయ వ్యూహాలతో ముందుకు వెళుతూ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు అనుచర వర్గంలో కొండంత విశ్వాసం కలిగిస్తున్నారు. ఎన్నికల తర్వాత వారికి పార్టీలో తగిన గుర్తింపుతో పాటు పదవులతో అందలం ఎక్కించాలన్న ఆలోచన కూడా చేస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి నాలుగు నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని, అభ్యర్థులను విజయ సింహాసనం ఎక్కించాలని చంద్రబాబు నాయుడుకి కానుకగా ఇవ్వడం కోసం ఆయన శ్రమిస్తున్నారని చెప్పారు.

హోరెత్తిస్తున్న కూటమి ప్రచారం...

సూళ్లూరుపేటలో తెలుగుదేశం కూటమి ర్యాలీతో పేట పురవీధులు అంతా టిడిపి, జనసేన,బిజెపి జెండాలతో డీజే మ్యూజిక్లతో భారీ బైక్ ర్యాలీతో కార్యకర్తలు కూటమి ప్రచారాన్ని హోరెత్తించారు. అడుగడుగునా పూల వర్షంతో పార్టీ నాయకుల రథానికి ఘన స్వాగతం పలికారు. సందర్భంగా పార్టీ ప్రచార రథం పై నుండి నాయకులు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ సూళ్లూరుపేటలో వైసీపీ ప్రభుత్వ ఎమ్మెల్యే అరాచక పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. స్థానిక వ్యాపార వేత్తలను ఇబ్బంది పెడుతూ గంజాయి ముఠాలను గుట్కా అక్రమ గ్రావెల్ అక్రమ ఇసుక రవాణా ప్రోత్సహిస్తూ తెలుగుదేశం కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని.. గతంలో పోలీస్ అధికారుల అండతో టిడిపి కార్యకర్తలపై అక్రమ కేసులు అధికారము ప్రదర్శించిన సిఐని వదిలిపెట్టేది లేదని, ఎక్కడ దాక్కొని ఉన్న బయటికి లాక్కొచ్చి అంతు చూస్తానని హెచ్చరించాడు. ఇక్కడ సంజీవయ్య చేసిన అభివద్ధి శూన్యమన్నారు. రాబోయేది మోడీ ప్రభుత్వం రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు పాలన రావడం తథ్యమన్నారు. అనంతరం సూళ్లూరుపేట తెలుగుదేశం పార్టీ అభ్యర్థి విజయ శ్రీ మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గానికి సేవ చేసుకునే భాగ్యం తనకు కల్పించాలని ఓటర్లను ప్రార్థించారు.స్థానిక తెలుగుదేశం ముఖ్యనేత గంగా ప్రసాద్ మాట్లాడుతూ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ ఇక్కడ వైసిపి నాయకుల అరచకాలను గుర్తు చేసుకుని తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి గెలిపించవలసిందిగా కోరారు.

ప్రలోభాలకు గురి చేస్తే కఠిన చర్యలు: డిఎస్‌పి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఈనెల 13వ తేదీ నిర్వహించనున్న ఎన్నికల్లో ఓటర్లను ఎవరైనా భయపెట్టినా, ప్రలోభ పెట్టినా వారిపై చట్టపర కఠిన చర్యలు తీసుకుంటామని గూడూరు డిఎస్‌పి సూర్య నారాయణ రెడ్డి హెచ్చరించారు. గూడూరు పట్టణంలోని సబ్ డివిజనల్ పోలీసు కార్యాలయంలో డీఎస్పీ సూర్య నారాయణ రెడ్డి శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ఈనెల 13వ తేదీ అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా బందోబస్తు చర్యలు తీసుకున్నామని రాజకీయ పార్టీలు శనివారం సాయంత్రం 6 గంటల తర్వాత ఎలాంటి ప్రచారాలు చేయకూడదని తెలిపారు. పోలింగ్ రోజున దొంగ ఓట్లు వేసిన ఓటర్లను ప్రలోభ పెట్టిన ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, చట్ట పర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నిర్వహణకు అదనపు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న గూడూరు డిఎస్‌పి సూర్యనారాయణరెడ్డి

పపట్టపగలే వెలుగుతున్న వీధి లైట్లు

పట్టపగలే వెలుగు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని మంగళం క్వార్టర్స్‌లో వీధి దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. అసలే ఉమ్మడి శెట్టిపల్లె పంచాయతీ నుండి విడిపోయిన పంచాయతీలకు ఆదాయం అంతంత మాత్రంగానే ఉన్న పరిస్థితుల్లో వీధి దీపాలు పగలు రాత్రి తేడా లేకుండా వెలుగుతున్నాయి. దీనిపై పంచాయతీ సిబ్బందిని వివరణ కోరగా విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్తు లైన్లను మార్చే క్రమంలో ఆపు చేయడానికి వైరు ఏర్పాటు చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని తెలిపారు.

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - పుత్తూరు :

వడమాలపేట మండలం బట్టి కండ్రిగలో వైసిపికి చెందిన 10 కుటుంబాలు టిడిపిలో చేరాయి. వీరికి నగరి నియోజకవర్గ టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ చేతుల మీదుగా పార్టీ కండువాలు కప్పి ఆహ్వా నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఈ ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు.

పాకాల మండలంలో ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

క్రైస్తవుల సంక్షేమమే టిడిపి లక్ష్యం

- టిడిపి క్రిస్టియన్ సెల్ మండల అధ్యక్షుడు దేవ సహాయం

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్:

క్రైస్తవుల పట్ల టిడిపి ఎప్పుడు కృతజ్ఞతా భావంతో ఉంటుందని, క్రైస్తవుల అభివృద్ధి లక్ష్యంగా టిడిపి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతోందని టిడిపి క్రిస్టియన్ సెల్ మండల అధ్యక్షుడు దేవ సహాయం అన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో శుక్రవారం పాకాల మండలంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి క్రిస్టియన్ల అభివృద్ధికి క్రిస్టియన్ మిషనరీ డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేసి చర్చిల నిర్మాణం పునరుద్ధరణ, ఆర్థిక సాయం అందిస్తుందని పేర్కొన్నారు. క్రిస్టియన్లకు శ్మశాన వాటిక కేటాయింపు, జెరూసలేం యాత్రకు వెళ్లే వారికి ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. పాస్టర్లను గుర్తించి వారికి ఐడి కార్డ్స్,ఆరోగ్య బీమా వర్తింప చేస్తుందని, మైనారిటీ బోర్డు నుండి క్రిస్టియన్ కార్పొరేషన్‌ను వేరు చేయడం, ఆర్థికంగా బలోపేతం సాధించడానికి వీలవుతుందన్నారు. మండల స్థాయి నుండి పంచాయతీ స్థాయి వరకు మౌలిక సదుపాయాలతో క్రిస్టియన్లు అందరూ ఉపయోగించుకునే విధంగా శ్మశాన వాటికలు ఏర్పాటు చేస్తుందన్నారు. దామాషా పద్ధతిలో చర్చిలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం కోసం పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. క్రైస్తవులందరూ పులివర్తి నానిని మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పాస్టర్లు, క్రైస్తవులు, టిడిపి నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.

విజయానికి ఐక్యంగా కృషి చేయాలి: కోనేటి ఆదిమూలం

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు నియోజకవర్గంలోని టిడిపి కూటమి కార్యకర్తలు మనస్పర్థలు వీడి ఐక్యంగా టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోనేటి ఆదిమూలం, బిజెపి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్ గెలుపునకు కృషి చేయాలని కోనేటి ఆదిమూలం వాపోయారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి, కేంద్రంలో మోడీ ప్రధాని అయితేనే అభివృద్ధి వుంటుందన్నారు. 13వ తేదీ ఓటు హక్కును అందరూ వినియోగించుకోవాలని కోరారు.

ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం

ఆదర్శ పాఠశాల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కనమనంబేడు ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో11వ తరగతిలో ప్రవేశానికి ఖాళీలు ఉన్నట్లు గిరిజన సంక్షేమ సాధికారిక జిల్లా అధికారి బి సూర్యనారాయణ, బుచ్చి నాయుడు కండ్రిగ ఏకలవ్య ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ దామోదర్ నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11వ తరగతిలో సిబిఎస్‌సి విధానంలో ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుందని, ఈ పాఠశాలలో ఖాళీల భర్తీకి బాలురు, బాలికలు ఈ నెల 18వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ పాఠశాలలో గిరిజనులకు మాత్రమేనని ప్రవేశం వున్నా తల్లిదండ్రులు లేని పిల్లలకు, ప్రత్యేక ప్రతిభావంతులకూ అవకాశం వుందన్నారు. ఈ పాఠశాలలో ఎంపిసి, బైపిసి, హెచ్ఇసి గ్రూపులు వున్నాయని తెలిపారు. విద్యార్థుల ఎంపిక పదవ తరగతి మార్కుల ఆధారంగా వుంటుందని చేరాలనుకున్న ఈ నెల 18వ తేదీ లోపు ఆన్‌లైను ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎపిటిడబ్ల్యు గురుకులం.ఎపి.జివొవి.ఇన్ వెబ్‌సైట్‌కు దరఖాస్తులు పంపాలని కోరారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వివరాలకు ఫోన్ నెంబర్ 9440204745ను సంప్రదిం చాలన్నారు.

అభివృద్ధికి సహకరిస్తా..

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ఆర్యవైశ్యుల వ్యాపారుల అభివృద్ధికి భరోసా ఎల్లప్పుడూ ఉంటుందనీ, వారి వ్యాపారాభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి ప్రాంగణంలో శుక్రవారం ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి వారితో ముఖాముఖి మాట్లాడుతూ పట్టణ నాలుగు మాడ వీధులలో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా అండర్ గ్రౌండ్ కేబుల్ సిస్టం, స్ట్రీట్ లైట్లను ఏర్పాటు చేశానని తెలిపారు. శివం టు శివం రోడ్డులో పొట్టి శ్రీరాములు సర్కిల్‌ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. మహాత్మా గాంధీ విగ్రహాన్ని పున:నిర్మిస్తామని తెలిపారు. ఆర్యవైశ్యులకు అన్నదాన సత్రాన్ని దేవస్థానం ద్వారా స్థలాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు బోర్డు ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఆలయ ఛైర్మన్ జూలకంటి మురళి, పాలక మండలి సభ్యులు రాము గుప్తా, ప్రత్యేక ఆహ్వాన సభ్యులు జూలకంటి సుబ్బారావు, పి జె చంద్రయ్య శెట్టి, ఓరుగంటి నాగేశ్వరరావు, ఆనంద్ గుప్తా, జూలకంటి నరసింహులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు మధు భరోసా



జ్ఞాపికను అందిస్తున్న అర్యవైశ్య సంఘం నాయకులు

సొంత గూటికి మాజీ జెడ్‌పిటిసి సుభాషిణి

ప్రజాశక్తి -రామచంద్రాపురం: చంద్రగిరి నియోజకవర్గం తిరుపతి రూరల్ మండలం మాజీ జెడ్‌పిటిసి కురకాల్వ సుభాషిణి, మాజీ ఎంపిటిసి కె సుధాకర్‌లు సొంతగూటికి (టిడిపి)లో చేరారు. శుక్రవారం తిరుపతి రూరల్ మండలం రఘునాథ్ రిసార్ట్స్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో ఆవిలాల పంచాయతీకి చెందిన ముఖ్య నేతలు సుభాషిణి, సుధాకర్ లతోపాటు, శంకరయ్య, గంగయ్య, నిఖిల్, మహేష్, మునికేశవులు, పురుషోత్తం, కె.విజయ్, శీను ఆచారి, పృధ్వీ, కాటయ్య, నాగభూషణం, తేజ, కిరణ్, సుబ్బులయ్య, రామచంద్రయ్య, హేమంత్, ఏ.రవి, ఇతిహాస్, రవి, మోహిత్ సాయి టిడిపిలో చేరారు. వారి చేరికతో తిరుపతి రూరల్ మండలంలో వైసిపికి బిగ్ షాక్ తగిలింది. ఆ పార్టీ ముఖ్య నేత లంతా వరుసగా టిడిపిలో చేరారు. చెవిరెడ్డి కుటుంబ పాలన, ప్రజాప్రతి నిధులకు గుర్తింపు ఇవ్వక పోవడం, పల్లెలో సమస్యలు పట్టించుకోకపోవడంతో వైసిపి వీడినట్లు వారు తెలిపారు. ఆత్మాభిమానం, గౌరవం కోసం నిత్యం ప్రజా సమస్య లపై పోరాడుతున్న పులివర్తి నాని వెంట నడిచేం దుకు తాము సిద్ధమయ్యామని తెలిపారు. నాని గెలుపునకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బడి సుధా యాదవ్, ఏ ఈశ్వర్ రెడ్డి,, దామినేటి నాగరాజు, వెంకటేష్, లక్ష్మీనారాయణ స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

పులివర్తి నాని సమక్షంలో టిడిపిలో చేరుతున్న వైసిపి నాయకులు

టిడిపి నాయకులు బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ:

సత్యవేడు నియోజకవర్గ టిడిపి కూటమి అభ్యర్థి కోనేటి ఆదిమూలం, బిజెపి పార్లమెంట్ అభ్యర్థి వరప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ టిడిపి మండల అధ్యక్షులు సుధాకర్ నాయుడు ఆధ్వర్యంలో 100 బైక్‌లలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. బుచ్చినాయుడు కండ్రిగ టిడిపి కార్యా లయం నుండి పలు గ్రామాలలో ర్యాలీ ప్రారంభిం చారు. ఈ ర్యాలీలో టిడిపి సీనియర్ నాయకులు, ఉమ్మడి జిల్లా మాజీ గ్రంథాలయ ఛైర్మన్ కన్నయ్య నాయుడు, జెడ్‌పిటిసి సునీత సుధాకర్ నాయుడు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బోరు మోటారును ప్రారంభిస్తున్న వైసిపి నాయకులు

వైసిపి నేతల చొరవతో తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ:

వైసిపి నాయకుల చొరవతో బి యన్ కండ్రిగ మండ లం పల్లమాల పంచా యతీలోని పచ్చాలమ్మ కాలనీ వాసుల తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిం ది. నాల్గు సంవత్స రాలుగా తాగు నీటి కోసం అల్లాడు తున్న గ్రామంలో గతంలో మూరు బోర్లు వేసినా నీళ్ల సరిగా అందక కాలనీ వాసులు ఇబ్బంది పడే వారు. సమస్య శాశ్వత పరిష్కారానికి వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె గోపాల్ రెడ్డి, సర్పంచ్ జెవి రమణమ్మ శుక్రవారం బోరు పాయింట్‌ను పరిశీలించి చెరువు సమీపంలో బోరు ఏర్పాటు చేశారు. నీరు బాగా పడటంతో సుమారు అర్ద కిలో మీటరు దూరం లో వున్న పచ్చాలమ్మ కాలనీకి పైపులు పూడ్చి తాగు నీటి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా పచ్చాలమ్మ కాలనీ, గిరిజన కాలనీ వారు తమ తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన గోపాల్ రెడ్డికి, గ్రామ సర్పంచి జేవి రమణమ్మకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

క్రీడా విజేతలకు డిస్కం స్పోర్ట్స్ కౌన్సిల్ అభినందన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఏపీ కార్పొరేషన్ ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీకి సంబంధించిన విద్యుత్ తిరుపతి సర్కిల్ క్రీడలలో జిల్లాకు చెందిన విజేతలను స్పోర్ట్స్ కౌన్సిల్ కు చెందిన అధ్యక్ష కార్యదర్శులు అభినందించారు. స్థానిక ఎస్పీడీసీఎల్ సంస్థ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, కార్యదర్శి వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 1, 2, 3వ తేదీలలో ఆర్‌టిపిలో నిర్వహించిన కల్చరల్ కాంపిటేషన్లో తిరుపతి సర్కిల్‌కు తృతీయ స్థానం లభించింది. ఈ నెలలో 7,8,9 తేదీలలో నెల్లూరులో నిర్వహించిన పురుషుల అథ్లెటిక్ విభాగంలో తిరుపతి జట్టుకు ఓవరా ల్ ఛాంపియన్ షిప్ ద్వితీయ స్థానం దక్కింది. ఈ సందర్భం గా విజయానికి కారకు లైన క్రీడాకారు లను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో కల్చరల్ సెక్రటరీ జయచంద్ర, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ సెక్రెటరీ పురుషోత్తం, ట్రెజరర్ వి. లీలారం, మూర్తి రాజు, నాగభూషణం వాసుదేవా చారి, శివశంకర్, సురేషు దేవి ప్రసన్న, నరసమ్మ, సంజీవ్ కుమార్, పి చంద్రశేఖర్ బాబు, వినాయకం, బాలాజీ, హరికృష్ణ లు పాల్గొన్నారు.

విజేతలను అభినందిస్తున్న డిస్కం స్పోర్ట్స్ కౌన్సిల్

పోలింగ్‌కి 48 గంటల ముందే 144 సెక్షన్: తహశీల్దారు

ప్రజాశక్తి-సోమల: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం పోలింగ్ నేపథ్యంలో 48గంటల ముందు నుంచే 144సెక్షన్ అమలు చేయనున్నట్లు తహశీల్దార్ నాగరాజు తెలిపారు. పోలింగ్ పూర్తయిన 24గంటల వరకూ 144సెక్షన్ అమల్లో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. బహిరంగ సమావే శాలు నిర్వహించడం, ఐదుగురికి మించి గుంపుగా చేరడం, గుంపులుగా కలిసి వెళ్లడం, పోలింగ్ ప్రదేశంలో వాహనాలకు అనుమతి లేదని లౌడ్ స్పీకర్లు వినియోగించ రాదని నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బిఎస్‌పి అభ్యర్థి శోభనాయుడు

బిఎస్‌పి ప్రచారం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో బిఎస్‌పి పలమనేరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్ శోభ నాయుడు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ ఏనుగు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కృపాలక్ష్మిని ఆశీర్వదించండి
- నారాయణస్వామి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: వైసిపి ఎమ్మెల్యేగా కృపాలక్ష్మికి అవకాశం ఇచ్చి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి కోరారు. శుక్రవారం కార్వేటినగరం మండలంలోని ఆరకేటివిపేట పంచాయతీలో ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. కృపాలక్ష్మిని ఆశీర్వదిం చాలని, ఫ్యాను గుర్తుకు ఓటే వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఆయన వెంట ఎంపిపి లతాబాలాజీ, సర్పంచ్ దివ్య, మాజీ జెడ్పిటిసి దేవకిలోకనాథరెడ్డి, నాయ కులు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్ద పంజాణిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపిపి రెడ్డెప్ప

వైసిపి అధికారంతోనే పల్లె ప్రగతి: ఎంపిపి

ప్రజాశక్తి-పెద్దపంజాణి: వైసిపి అధికారంతోనే పల్లె ప్రగతి సాధ్యమవుతుందని ఎంపిపి రెడ్డెప్ప అన్నారు. శుక్రవారం మండలంలోని కోగిలేరు పంచాయతీలో స్థానిక సర్పంచ్ రమేష్ బాబు ఆధ్వర్యంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటే గౌడను గెలిపించాలని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ రాష్ట్రంలో మరోసారి వైసిపి అధికారం చేపడితే సంక్షేమ ఫలాలు కొన సాగడంతో పాటుగా మరింత అభివృద్ధి సాధ్యమ వుతుందని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వెంకటే గౌడ, ఎంపి రెడ్డెప్ప విజయానికి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిటిసి పరంధామ, నాయకులు శివశంకర్ రెడ్డి, సునీల్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివ

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం, గంగాధరనెల్లూరు: పోలింగ్ నిర్వహణ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటర్లు నిర్భయంగా ఓటు వినియోగించుకునేలా పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నట్లు జీడీ నెల్లూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివ తెలిపారు. శుక్రవారం ఎస్ఆర్ పురం, జీడీ నెల్లూరు తహశీల్దారు కార్యాలయంలో అధికారులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శనివారం 5గంటలకు ప్రచారాలు పూర్తవుతుందని ఆ తరువాత ప్రత్యక్షంగా, పరోక్షంగా ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పూర్తి స్థాయిలో కోడ్ పాటించాలని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటర్లను భయభ్రాం తులకు గురిచేస్తే ఎట్టి పరిస్థితిల్లో ఉపేక్షించేది లేదని తెలిపారు.

మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివ

సదుంలో పోలీసుల కవాతు

ప్రజాశక్తి-సదుం, సోమల: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా చిత్తూరు జిల్లా ఎస్‌పి మణికంఠ ఆదేశాలు మేరకు సదుం మండల పరిధిలో పుంగనూరు రూరల్ సర్కిల్ సిఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐఎస్ఎఫ్ కమాండెంట్ డి.కె మిశ్రా నేతృత్వంలో బలగాలతో కవాతు నిర్వహించారు. సదుం, జాంద్రపేట, కాలేజీ రోడ్, నడిగడ్డ, చెరుకువారిపల్లి తదితర గ్రామాలలో ఫ్లాగ్ మార్చ్ చేపట్టి ఓటర్లకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వందన, హెడ్ కానిస్టబుల్ మురళి, మహిళా పోలీసులు పాల్గొన్నారు. సోమల మండలంలో ఎస్ఐ వెంకటనరసింహులు ఆధ్వర్యంలో శుక్రవారం కవాతు నిర్వహించారు. ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజలకు భరోసా కల్పించారు. శాంతిభద్రతల విషయంలో పోలీసులకు సహకరించాలని కోరారు.

కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తికి పరామర్శ

ప్రజాశక్తి-వెదురుకుప్పం: కార్వేటినగరం ముస్లిం కాలనీకి చెందిన దస్తగిరి ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఇటీవల గాయపడ్డారు. విషయం తెలుసుకున్న టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ శుక్రవారం దస్తగిరి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసు కున్నారు. ఎన్నికల అనంతరం ఆయన ఉచితంగా శస్త్ర చికిత్స చేయిస్తానని హామీ ఇచ్చారు. థామస్ వెంట మైనారి టీ నాయకులు నియాజ్, ముజీబ్, షబీర్, జాకీర్ ఉన్నారు.



దస్తగిరిని పరామర్శిస్తున్న డాక్టర్ థామస్

విదేశీ విద్యార్థినికి పిహెచ్‌డి

ప్రజాశక్తి- గుడుపల్లి: ద్రావిడ విశ్వవిద్యాలయం లింగ్విస్టిక్స్ విభాగంలో పరిశోధన చేస్తున్న మంగోలియా దేశానికి చెందిన విద్యార్థిని అల్గిర్మా బాలజీన్యామ్‌కు వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య కొలకలూరి మధుజ్యోతి శుక్రవారం పిహెచ్‌డి పట్టాను అందించారు. వర్సిటీ లింగ్విస్టిక్స్ విభాగంలోని ఆచార్య గణేషన్ అంబేద్కర్ పరిశోధన పర్యవేక్షణలో 'మెజర్మెంట్స్ ఆఫ్ ఇంగ్లీష్ రైటింగ్ స్కిల్స్: కేస్ స్టడీ ఆన్ మంగోలియన్ కాలేజ్ స్టూడెంట్స్' అనే అంశంపై సమర్పించిన పరిశోధన సిద్ధాంత గ్రంథానికి ఆమెకు పిహెచ్‌డి పట్టాను ప్రదానం చేసినట్లు తెలిపారు. ద్రావిడ వర్సిటీలో విదేశీ విద్యార్థినికి మొట్టమొదటిసారి పి హెచ్ డి పట్టా పొందడం పట్ల ఆమె సంతోషాన్ని వ్యక్తం చేశారు. వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

పిహెచ్‌డి పట్టా అందుకుంటున్న విదేశీ విద్యార్థి

వైసిపిలో తగిన గుర్తింపు లేదు..

- వైసిపి నాయకులు మీరా రెడ్డి దంపతుల ఆవేదన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : వైసిపి పటిష్టతకు పనిచేసిన తమకు ఎన్నికల్లో ఎలాంటి బాధ్యతలు ఇవ్వకుండా పక్కన పెట్టారని అందువల్ల ఎన్నికలకు దూరంగా ఉన్నామని పట్టణ ప్రజలకు ఏ ఇబ్బంది వచ్చినా తమ వంతు సాయం అందిస్తామని గూడూరు పట్టణ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కోడూరు కల్పలత, నాయకులు మీరా రెడ్డి పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కోడూరు కల్పలత నివాసంలో శుక్రవారం విలేకరు లతో మాట్లాడుతూ పట్టణ ప్రజలందరూ ఎంతో నమ్మకంతో తనను ఇండిపెండెంట్ మున్సిపల్ చైర్ పర్సన్‌గా అత్యధిక మెజార్టీతో గెలిపించారని వారి రుణం తీర్చుకోలేనిదని తెలిపారు. వైసిపి ప్రారంభం నుండి తాను , తన భర్త నిస్వార్థ సేవలు అందిస్తున్నామని, ఈ ఎన్నికల్లో కొంతమంది స్వార్థపరులు తమను పార్టీకి దూరం చేశారని పేర్కొన్నారు. అందువల్ల ప్రజల వద్దకు రాలేకపోయా మన్నారు. నాయకులు మీరా రెడ్డి మాట్లాడుతూ పార్టీ పెద్ద నాయకులు సూచించినా తమకు సరైన ప్రాధాన్యత ఇవ్వ లేదని పదవుల కోసం, వ్యాపారాల కోసం పార్టీ మారే సంస్కృతి తమకు లేదన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న కోడూరు కల్పలత, మీరా రెడ్డి



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

వైసిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-వెదురుకుప్పం: వెదురుకుప్పం పంచాయతీలో వైసిపి నాయకులు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి, ఎంపి అభ్యర్థి రెడ్డెప్పను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. వైసిపి అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని ఈ సందర్భంగా వారు తెలిపారు. వైసిపి ప్రకటించిన మ్యానిఫెస్టోను వివరించారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని గొల్ల చీమల పల్లి పంచాయతీ పరిధిలో గ్రామాలలో సర్పంచ్ రూప్సీ నాగభూషణ్ రెడ్డి ప్రజలతో పాటు ఇంటికి ప్రచారం నిర్వహించి గ్రామంలోని ప్రజలకు గతంలో అందించిన పథకాలు కొత్తగా ముఖ్యమంత్రి అమలు చేసిన సంక్షేమ పథకాలు గురించి వివరించి సంక్షేమ మళ్లీ కావాలంటే ఫ్యాన్ గుర్తుకే ఓటేసి పలమనేరు నియోజకవర్గం ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎంపి అభ్యర్థి రెడ్డప్ప ను గెలిపించాలని సర్పంచ్ ఓటర్లకు వివరిస్తూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రూప్సీ నాగభూషణ్ రెడ్డి, ఎంపిటిసి అభినవ్, వార్డ్ మెంబర్లు, వైసిపి పంచాయతీ నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి: శ్రీనివాసులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు అర్బన్ హెల్త్ సెంటర్ కాజూరు పరిధిలోని జానకారపల్లె సచివాలయం, వార్డు ఏరియాలో జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు ఫ్రైడే డ్రైడే తనిఖీలు చేపట్టారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రజలకు దోమలు ద్వారా వచ్చే డెంగీ, మలేరియా, బోదకాలు, చికున్ గున్యా మొదలైన జ్వరాలు రాకుండా ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని తెలిపారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడుకోవడం రాత్రి వేళల్లో వేపాకు పొగ వేసుకోవాలని, ఇంటి చుట్టు పక్కల మురికినీరు నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు, సబ్ యూనిట్ ఆఫీసర్లు రామకృష్ణ, పీరు సాహెబ్ సూపర్వైజర్ నారాయణ, శానిటరీ సెక్రటరీ అఫ్రిన్ ధనలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: సంక్షేమ పథకాలు, అభివృద్ధి కావాలంటే చంద్రబాబును సీఎంగా గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని టిడిపి మండల అధ్యక్షులు గంధమనేని జయశంకర్ నాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని వివిపురం పంచాయతీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్‌ను గెలిపించాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో సిద్ధయ్య శెట్టి, నిరంజన్ రెడ్డి, హేమాద్రి యాదవ్, భూపతి రెడ్డి, గురు, బలగాల బాబు నాయుడు, చొక్కా మడుగు కుమార్, హేమాద్రి యాదవ్, నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

బైరెడ్డిపల్లి: మండలం లోని 104 గ్రామాలలో 15 రోజులుగా టిడిపి మండల నాయకులు ప్రచారం కోసం రెండు గ్రూపులుగా విడి పోయి -విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా మాజీ ఎంపిపి డాక్టర్ కృష్ణవేణి జై కుమార్, మాజీ జెడ్పిటిసి రాధా కిషోర్ గౌడ, పూర్ణచంద్ర గౌడ్, సుబ్రహ్మణ్యం శెట్టి ఒక గ్రూపు, బోవనచంద్ర గౌడ్, కిషోర్ గౌడ్ ఎస్సీ జిల్లా అధ్యక్షులు సురేష్ చలపతి రెండవ గ్రూపుగా విడిపోయి టిడిపి విస్తృత ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో బైరెడ్డిసాయిగౌడ, సాయిప్రతాప్ గౌడ, అరుణ్ సురేష్ బాబు, టిడిపి మాజీ సర్పంచులు, ఎంపిటిసీలు, జన్మభూమి కమిటీ సభ్యులు, టిడిపి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చిత్తూరులో కాంగ్రెస్ ప్రచారం

ఇంటింటి ప్రచారంలో టిక్కీ రాయల్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి అయిన టిక్కీ రాయల్ శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పొన్ని అమ్మ గుడి వీధి, చర్చి వీధి, పాత బస్టాండు, సుందరయ్య వీధి, కుమ్మర వీధిలలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా టిక్కీ రాయల్ మాట్లాడుతూ ఓటుకు నోటు చిత్తూరుకు చేటు కాబట్టి నిజాయితీగా నోటు తీసుకోకుండా మీ భవిష్యత్తు కోసం మీ పిల్లల భవిష్యత్తు కోసం ఐదు సంవత్సరాలు మిమ్మల్ని పరిపాలించే వాళ్ళు మీకు సేవ చేసే వాళ్ళని మీరు ఓటమి ఆయుధంతో నిజాయితీగా ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే కాంగ్రెస్ పార్టీ తొమ్మిది గ్యారంటీలతో మేనిఫెస్టో ఇదివరకే కరపత్రాల రూపంలో పంచడం జరిగిందన్నారు. ప్రత్యేక హోదా రావాలంటే 'మార్పు రావాలి కాంగ్రెస్ కావాలి' ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నరేష్, చందు రాజీ, ఉదయ్ కుమార్, మధు కుమార్, సుమంత్, భరత్, ప్రవీణ్, సురేంద్ర, లోకేష్ బాబు ఇజాక్ బాబు, సురేష్ సిపిఐ నుండి విజయ గౌరీ పాల్గొన్నారు.

జగన్‌వన్నీ ఉత్తుత్తి బటన్లే

ఎన్నికల ప్రచారంలో సిపిఐ రాష్ట్రనేత హరినాథరెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

సార్వత్రిక ఎన్నికల వేళ ప్రజలను మభ్య పెట్టడానికే జగన్ బటన్ నొక్కుడు కార్యక్రమం చేపట్టారని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి ఆరోపించారు. 'ఇండియా' కూటమి తరపున సిపిఐ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మురళిని గెలిపించాలని కోరుతూ శుక్రవారం తిరుపతి నగరంలోని లెనిన్ నగర్, ప్రగతి నగర్, గరుడాద్రి నగర్ లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కంకి, కొడవలి గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా హరినాథరెడ్డి మాట్లాడుతూ... జగన్ మూడు నెలల కిందట బటన్ నొక్కినా పేదల ఖాతాల్లో నగదు జమ కాలేదన్నారు. అవన్నీ ఉత్తుత్తి బటన్ నొక్కుళ్లే అన్నారు. పోలింగ్ దగ్గర పడటంతో ఓటర్లను ప్రలోభ పెట్టడానికి వారి ఖాతాల్లో ఇపుడు నగదు జమ చేస్తున్నామని ప్రచారం చేసుకుంటున్నారని, ఇలా చేయడం ఎన్నికల నియమావళికి విరుద్ధమని అన్నారు.భూమన కరుణాకర్‌రెడ్డి టీడీఆర్ బాండ్లు ఇస్తానని ఇవ్వలేదన్నారు. చాలా మందికి ఇంకా పెండింగులో ఉన్నాయన్నారు. అవి కూడా సక్రమమైన పద్ధతిలో చట్ట ప్రకారం చేయలేదనే విమర్శలు ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి, నగర కార్యదర్శి విశ్వ నాథ్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, చిత్తూరు జిల్లా కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు. సాయంత్రం సిపిఐ, సిపిఐ సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

కాంగ్రెస్‌ను గెలిపించండి: రమేష్

ప్రజాశక్తి-వెదురుకుప్పం: ప్రజలంతా కాంగ్రెస్ పార్టీని ఆదరించి హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని జీడీ నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్‌బాబు కోరారు. శుక్రవారం కార్వేటినగరం మండలంలోని పాదిరికుప్పంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్‌రెడ్డి, దినకర్‌బాబు, యుగంధర్‌నాయుడు, శివారెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో రమేష్ బాబు

స్మగ్లర్లు రోజా వెంటున్నారు: గాలి భానుప్రకాష్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

నగరి నియోజకవర్గం ఎమ్మెల్యే ఆర్కే రోజా వెంట ఎర్రచందనం స్మగ్లర్లు ప్రజా ప్రతినిధుల ముసుగులో ఉన్నారని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ ఆరోపించారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసలు సీఎం జగన్ పుత్తూరుకు ఎందుకు వచ్చారో స్థానిక ప్రజలకు అర్థం కాలేదన్నారు. నగరి నియోజకవర్గ ప్రజలకు సీఎం జగన్ నాడు గాలేరు నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు పూర్తి చేసి ఓట్లు అడుగుతానని, చేనేత కార్మికులకు 300 యూనిట్లు ఉచిత విద్యుత్తును అందిస్తానని హామీలు వల్లించి ఏ ఒక్క హామీ నిలబెట్టుకోకుండా నగరి నియోజకవర్గంలో ఎలా ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. శుక్రవారం సీఎం జగన్ రోజా ఓటమిని ప్రత్యక్షంగా చూశారన్నారు. కనీసం వెయ్యి మందితో కూడా సీఎం సభ జరిపించుకోలేని పరిస్థితి సీఎం పర్యటనలో కనిపించిందన్నారు. నగరి ప్రజలు ఎప్పుడో ఆర్కే రోజా ఓటమిని నిర్ణయించారని, తాను శాసనసభ్యుడిగా ఎన్నికైన

మాట్లాడుతున్న గాలి భానుప్రకాష్

తరువాత నగరి ప్రాంతానికి పరిశ్రమలు తీసుకువచ్చి స్థానికంగా ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానన్నారు. ఆర్కే రోజా నగరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదు కానీ ఆమె మాత్రం ఆర్థికంగా బలపడ్డారని, ఒకప్పుడు అద్దెలు చెల్లించడానికి ఇబ్బందులు పడ్డ రోజా నేడు ఆమె కుమారుడు సరదా పడితే కోటి 20 లక్షల వెచ్చించి బెంజ్ కారు కొనే స్థాయికి ఎదిగిందన్నారు. పదేళ్లలో ఎటువంటి అభివృద్ధి రోజా నియోజకవర్గానికి చేయలేదని, ఏమి అభివృద్ధి సాధించారో ప్రజలకు వివరించకుండా ఓట్లు అడుగుతున్నారని ఎద్దేవా చేశారు.

జిల్లా కేంద్రం నుంచే పోలింగ్ పర్యవేక్షణ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: పోలింగ్ రోజున పోలింగ్ ప్రక్రియను జిల్లా ప్రధాన కార్య స్థానం నుండి పరిశీలించుటకు, పోలింగ్ కేంద్రంలో సజావుగా ఓటింగ్ జరుగుతుందా లేదా అని పర్యవేక్షిస్తామని ప్రవీణ్‌కుమార్ చెప్పారు. పర్యవేక్షణ కోసం సత్వర చర్యలు కొరకు మీడియా మానిటరింగ్, వెబ్ కాస్టింగ్, కమ్యూనికేషన్ కంట్రోల్ రూం ల ఏర్పాట్ల విధి విధానాలపై జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ సమీక్ష నిర్వహించారు. శుక్రవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ వెబ్ కాస్టింగ్, పిడిఎంఎస్, మీడియా మానిటరింగ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుతో పక్కాగా పర్యవేక్షించాలని తెలిపారు. పోలింగ్ రోజున ఎలక్ట్రానిక్ మీడియా సోషల్ మీడియా లలో ప్రసారమయ్యే ఎన్నికల ప్రతికూల అంశాలను మీడియా మానిటరింగ్ కంట్రోల్ రూమ్ నందు పరిశీలించి వాటిని ఎప్పటికప్పుడు కమ్యూనికేషన్ కంట్రోల్ రూమ్ వారితో సమన్వయం చేసుకొని సత్వరమే ప్రతికూల వార్తలపై స్పందించి చర్యలు చేపట్టాలని, అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అలాగే పోల్ డే మానిటరింగ్ సిస్టం అప్లికేషన్ ను ప్రిసైడింగ్ అధికారులు తదితర ఎన్నికల సంబంధిత అధికారులు తమ సెల్ ఫోన్లో డౌన్లోడ్ చేసుకుని ఎన్నికల సామాగ్రి డిస్ట్రిబ్యూషన్, పోలింగ్ సిబ్బంది కేంద్రాలకు చేరుకోవడం, మాక్ పోల్ తదితర సమాచారం ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాల్సి ఉంటుందని సూచించారు. వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు పర్యవేక్షణ నోడల్ అధికారి శ్యామ్ మోహన్ వెబ్ కాస్టింగ్ ఏజెన్సీ తో సమన్వయం చేసుకుని పూర్తి స్థాయిలో ఏర్పాటు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, ఎస్డిసి మురళి, డిఎల్డిఓ సుశీల దేవి, పిడి డిఆర్డిఎ ప్రభావతి, సిపిఓ ప్రేమ్ చంద్ర రెడ్డి, బాల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న కాంగ్రెస్, సిపిఎం

ప్రజాశక్తి-సత్యవేడు: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్, సీపీఎం నేతలు దూసుకుపోతున్నారు. శుక్రవారం మండలంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాలగురువం బాబు సీపీఎం నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. సత్యవేడు క్లాక్ టవర్ వద్ద నిర్వహించిన పత్రిక సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి బాలగురువం బాబు మాట్లాడుతూ మోడీ మత రాజకీయాలను వ్యతిరేకిస్తూ ఎన్నికల్లో ఢీకొంటున్న ఇండియా ఫోరంకి మద్దతుగా దేశవ్యాప్తంగా ప్రజలు అశేష ఆదరణ తెలుపుతున్నారన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. అదేవిధంగా రాష్ట్ర విభజన నేపథ్యంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పూర్తిగా నెరవేరుస్తామని

స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం కోసం హస్తం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా సెక్రటరీ ఎస్.మాణిక్యం, మండల అధ్యక్షుడు బి.కే.పురుషోత్తం, నాయకులు రఘునాథ్, దాము, అంబేద్కర్, గాంధీ, సిపిఎం పార్టీ సత్యవేడు మండల కార్యదర్శి మెలుగు రమేష్, యువజన సంఘ నాయకులు టి.మురళి కార్యకర్తలు పాల్గొన్నారు.

కష్టసుఖాల్లో తోడుగా ఉంటా: పులివర్తి నాని

ప్రజాశక్తి-రామచంద్రపురం(తిరుపతి రూరల్): చంద్రగిరి నియోజకవర్గం ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ఉంటానని, సమస్యల పరిష్కారానికి ముందుంటానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. శుక్రవారం తిరుపతి రూరల్ మండలం, పద్మావతిపురం పంచాయతీలో టీడీపీ నాయకులు రవి, గణపతి నాయుడుల ఆధ్వర్యంలో బహిరంగ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పులివర్తి నాని హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ చంద్రగిరి అభివృద్ధికి కృషి చేయడంతో

సమావేశంలో మాట్లాడుతున్న పులివర్తి నాని

పాటు పరిశ్రమలు స్థాపించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు.

విద్యార్థుల అభినందన సభ

ప్రజాశక్తి-సత్యవేడు: సత్యవేడు పట్టణంలోని మాస్టర్స్ స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థుల అభినందన సభను ఆ పాఠశాల యాజమాన్యం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పది ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. మాస్టర్స్ స్కూల్ అధినేతలు శ్రీనివాసులు రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ సభ జరిగింది.

ఈవీఎం స్ట్రాంగ్ రూంల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.షన్మోహన్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:

ఎస్‌విసెట్‌లోని ఈవీఎం స్ట్రాంగ్ రూములకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు పూరి చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.షన్మోహన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల నేపథ్యంలో ఎస్‌విసెట్ (శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల)లో ఈవీఎం స్ట్రాంగ్ రూములను, రిసెప్షన్ కేంద్రం, కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్లను అధికారులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల అనంతరం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భద్రపరచడానికి అవసరమైన అన్ని చర్యలు పూర్తి చేయాలన్నారు. ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. కళాశాలలోకి ప్రవేశించే మార్గాలు, వాహనాల పార్కింగ్‌కు అవసరమైన చర్యలు తీసుకోవాలని అక్కడి అధికారులకు దిశానిర్దేశం చేశారు. పటిష్టమైన బ్యారికేడింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు. అందుకు సంబంధించి పలు అంశాలను అధికారులతో చర్చించారు. ఏర్పాట్లు అన్నిటిని పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట పిఆర్‌ఆర్, బిఎస్‌ఈలు చంద్రశేఖర్ రెడ్డి, ఉమామహేశ్వర రెడ్డి, పూతలపట్టు ఆర్‌ఓ చిన్నయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ ప్యాకేజీకి సునీల్ అమ్ముడుపోయాడు

- పూతలపట్టు కాంగ్రెస్ అభ్యర్థి ఎం.ఎస్ బాబు ఘాటు విమర్శ

ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి ఎంఎస్ బాబు

ప్రజాశక్తి-ఐరాల:

పూతలపట్టు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ టీడీపీ ప్యాకేజీకి అమ్ముడుపోయాడని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.ఎస్ బాబు ఘాటు విమర్శలు చేశారు. శుక్రవారం ఆయన ఐరాల మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన ర్యాలీలో ఆయన పాల్గొని స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ ఎమ్మెల్యేగా ఉంటూ పేద వర్గాల ప్రజల కష్టాలను అతి దగ్గరగా చూశానని అయితే ఆ పార్టీ అధికారంలో ఉన్నా ఆ వర్గాలకు ఏం చేయలేకపోయానని అవమానం, అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరి పేద వర్గాలకు న్యాయం చేయాలనే ఆలోచనతో ప్రజల ముందుకు వచ్చినట్లు ఆయన వ్యాఖ్యానించారు. వైసీపీ అభ్యర్థి సునీల్ తనపై విమర్శలు చేయడం తగదన్నారు. వైద్యుడిగా ఉండి కూడా కోవిడ్ సమయంలో ప్రజలకు తోడ్పాటు అందించలేదని దుయ్యబట్టారు. గతంలో రూ.10కోట్ల ప్యాకేజీకి అమ్ముడుపోయిన రోజులు గుర్తు లేవా అంటూ ఆరోపణలు చేశారు. పేద వర్గాలకు చెందిన తాము ఒకరిపై ఒకరు మాట్లాడుకోవడం సరికాదన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలందరూ ఆదరించి హస్తం గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు.